# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

15.03.2026 ఆదివారం Sunday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 234 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


## మొజ్తబా ఆచూకీ చెబితే.. 10మిలియన్ డాలర్లు

### రివార్డ్ ఫర్ జస్టిస్ ప్రకటించిన అమెరికా

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆచూకీ కానీ, ఆయనకు సంబంధించిన కీలక సమాచారం కానీ అందించిన వారికి భారీ రివార్డు ప్రకటించింది. ఆచూకీ ఇచ్చిన వారికి 10 మిలియన్ డాలర్లు అంటే రూ.92 కోట్లు నజరానా ఇస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. 'రివార్డ్ ఫర్ జస్టిస్' కార్యక్రమం క్రింద ఈ బౌంటీ ఇస్తామని తెలిపింది.



4 లో..

## భయపడకండి

- యుద్ధం ఎఫెక్ట్‌పై భయాందోళనలు సృష్టిస్తున్న కాంగ్రెస్
- మోదీని దూషించడమే పనిగా పెట్టుకుంది
- అస్సాంలో ప్రధానమంత్రి మోదీ



వివరాలు 4వ పేజీలో



## ఖర్గ్ ఐల్యాండ్‌పై దాడి

అమెరికాకు ఇరాన్ వార్నింగ్

ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే లక్ష్యం గా.. ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఆ ద్వీపంలోని సైనిక స్థావరాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. తాజాగా ఈ దాడులను ఇరాన్ కూడా ధ్రువీకరించింది. అయితే, చమురు మౌలిక సదుపాయాలకు ఎలాంటి హాని కలగలేదని వెల్లడించింది.

4లో..



# గ్యాస్ కొరత లేదు

### కమర్షియల్ సిలిండర్లలో కొంత లోటు

- సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం
- ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్‌తో మంత్రి ఉత్తమ్ సమీక్ష
- ప్రజలు సంయమనంతో ఉండాలని సూచన

తెలంగాణలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, కేవలం కమర్షియల్ సిలిండర్ల విషయంలోనే కొంత కొరత ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎల్పీజీ డిస్టిబ్యూటర్స్ అసోసియేషన్ , ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

**హైదరాబాద్, మార్చి 14:** కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత మాత్రమే ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. అయినా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అవసరంగ లేకున్నా ముందస్తుగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని ఉత్తమ్ సూచించారు. కావాలని గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్పీజీ ఆయిల్ సరఫరా సంస్థలతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్..' ప్రస్తుత పరిస్థితులపై నిన్న అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాం. రాష్ట్రంలో 810 మంది ఎల్పీజీ డిస్టిబ్యూటర్ లు ఉన్నారు. 1.3 కోట్ల డోమాస్టిక్ కన్జుమర్స్ ఉన్నారు. 7.5 లక్షల కమర్షియల్ కన్జుమర్స్ ఉన్నారు. నెలకు యావరేజ్ 60 లక్షల సిలిండర్లు డొమెస్టిక్ వాడుతున్నారు. కమర్షియల్ సిలిండర్ విషయంలోనే కొరత ఏర్పడుతోంది. డొమస్టిక్ కన్జుమర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎలాంటి కొరత లేదు. ఆందోళనతో ముందస్తుగా అవసరం లేకున్నా గ్యాస్ బుక్ చేసుకుంటున్నారు. గృహ అవసర సిలిండర్లకు కొరత లేదు. కమర్షియల్ సిలిండర్లను కేంద్రం 20 శాతం సప్లై చేస్తోందన్నారు. కమర్షియల్ సిలిండర్ల విషయంలో కేంద్రానికి లేఖ రాశాం. ప్రతి రోజు 2.15 లక్షల ఎల్పీజీ డొమాస్టిక్ సిలిండర్లు సప్లై చేస్తారు. నిన్న మొన్న 2.3 లక్షలు సప్లై చేశారు. కమర్షియల్ సిలిండర్లు రోజుకు 23 వేలు సప్లై చేసే వాళ్లు. కానీ ప్రస్తుతం 6200 సిలిండర్లు మాత్రమే ఇస్తున్నారు.

మిగతా 3 లో



## మూడు నెలల్లో సంక్షేమ భవనాలు

- వచ్చే విద్యాసంవత్సరం నాటికి కొత్త వసతి గృహాలు సిద్ధం
- పెరిగిన డైట్, కాస్మోటిక్ చార్జీల చెల్లింపునకు ప్రాధాన్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం

3

## తెగిన క్రేన్ వైర్

ముగ్గురు కూలీల దుర్మరణం

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. వ్యవసాయ బావిలో పూడిక తీస్తుండగా క్రేన్ వైర్ తెగి పడటంతో ముగ్గురు కూలీలు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో మొగుళ్లపల్లి మండలం కొరికిశాల గ్రామానికి చెందిన సుకినే దేవారావు (48), బండారి అభిలాశ్ (16)తోపాటు.. పిడిసిల్ల గ్రామానికి చెందిన పైడయ్య (53) మృతిచెందారు. సుకినే మోహన్ రావు పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు.



## బండి సంజయ్ ఆశీర్వాద యాత్ర



- మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు 40 కిలోమీటర్ల పాదయాత్ర
- కొండగట్టును అభివృద్ధి చేస్తామని కేంద్రమంత్రి హామీ

2

## ఆయిల్ పామ్‌కు ఉజ్వల భవిష్యత్తు

- 22న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నర్మెట్ట ఫ్యాక్టరీ ప్రారంభం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

2







## ప్రేమ పేరుతో ఎయిడ్స్ రోగి వికృత చేష్టలు

- పెళ్లికి నిరాకరించిన యువతికి ఎయిడ్స్ ఇంజెక్షన్

వివరాలు 2వ పేజీలో



## బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు నా ప్రయాణం

రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే గొప్ప మార్పు

మంత్రి సీతక్క

ఢిల్లీలో జరిగిన షీ స్పార్క్ వేదికపై ఆదివాసీ బిడ్డ గళం

3 లో..

బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు తన జీవితం ప్రజాస్వామ్యం ఇచ్చిన అవకాశాల ఫలితమని మంత్రి సీతక్క అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఈ మార్పు సాధ్యమైందన్నారు. దేశవ్యా ప్తంగా వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న మహిళా నాయకులను ఒక వేదికపైకి తీసుకువచ్చిన షీ స్పార్క్ 2026 కార్యక్రమంలో సీతక్క ప్రసంగించారు.

నేటి సాక్షి TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | ఆదివారం 15 మార్చి 2026

# గ్యాస్ దండిగా ఉన్నా కృత్రిమ కొరత

**దేశంలో ధరలను నియంత్రణలో ఉంచిన మోదీ ప్రభుత్వం**

**మూసీ పునరుజ్జీవానికి 50 మీటర్ల బఫర్ జోన్ అవసరం లేదు**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**

**హైదరాబాద్, మార్చి 14:** దేశంలో గ్యాస్ దండిగా ఉన్నా కొందరు కావాలనే కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం ధరలను నియంత్రణలో ఉంచిందని, మూసీ పునరుజ్జీవానికి 50 మీటర్ల బఫర్ జోన్ అవసరం లేదని స్పష్టం చేశారు. యుద్ధం వల్ల అనేక దేశాల్లో గ్యాస్ ధరలు పెరిగినా మన దేశంలో మాత్రం ధరలు పెరగలేదని తెలిపారు. గతంలో గ్యాస్ ధర 1,200 రూపాయలు ఉంటే మోదీ ప్రభుత్వం 900 రూపాయలకు తగ్గించిందని గుర్తుచేశారు.

### సబర్మతి తరహాలో మూసీ అభివృద్ధి జరగాలి

మూసీ పునరుజ్జీవానికి 7,000 కోట్లు కేటాయించడంపై స్పందిస్తూ ఈ ప్రాజెక్టుకు బీజేపీ వ్యతిరేకం కాదని రామచందర్‌రావు అన్నారు. అయితే 50 మీటర్ల బఫర్ జోన్ నిబంధన అనవసరమని పేర్కొన్నారు. గాంధీ విగ్రహం ఏర్పాటుకు 100 ఎకరాలు కావాలా అని ప్రశ్నించారు. గుజరాత్‌లో ఎవరికీ నష్టం కలగకుండా సబర్మతి ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేశామని ఈ సందర్భంగా వివరించారు.



# బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు నా ప్రయాణం

**రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఈ గొప్ప మార్పు : మంత్రి సీతక్క**

**ఢిల్లీలో జరిగిన 'షీ స్పార్క్ 2026' వేదికపై ఆదివాసీ బిడ్డ గళం**

**న్యూఢిల్లీ, మార్చి 14:** బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు తన జీవితం ప్రజాస్వామ్యం ఇచ్చిన అవకాశాల ఫలితమని మంత్రి సీతక్క అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఈ మార్పు సాధ్యమైందని ఆమె పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న మహిళా నాయకులను ఒక వేదికపైకి తీసుకువచ్చిన 'షీ స్పార్క్ 2026' కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) శనివారం పాల్గొని ప్రసంగించారు. ఒకప్పుడు అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా నక్సలైట్ ఉద్యమంలో పనిచేసిన తాను ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసంతో ప్రధాన ప్రవాహంలోకి వచ్చానని తెలిపారు.

### కోర్టు బోను నుంచి న్యాయవాది వరకు



ఢిల్లీ ఐఐటీలో జరిగిన ఈ కార్యక్రమంలో తన జీవితం, మంత్రిగా తీసుకున్న నిర్ణయాలపై నిర్వాహకులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. విద్య ద్వారా జీవితాన్ని మార్చుకోవచ్చని నమ్మి న్యాయ విద్యను అభ్యసించి న్యాయవాదిగా పనిచేశానని, అనంతరం ప్రజల సేవ కోసం ఎన్నికల రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. తన జీవిత ప్రయాణాన్ని 'బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు' అని పేర్కొంటూ, ప్రజాస్వామ్యం ద్వారా సాధించే మార్పు శాశ్వతమని అన్నారు. ఒకప్పుడు న్యాయస్థానంలో నిందితురాలిగా నిలిచిన తాను, తర్వాత అదే కోర్టులో న్యాయవాదిగా నిలిచిన సందర్భం తన జీవితాన్ని మలుపు తిప్పిందని గుర్తుచేశారు.

### ఇందిరా మహిళా శక్తితో ఆర్థిక సాధికారత

సమాజంలో మార్పు తీసుకురావడంలో మహిళల పాత్ర కీలకమని సీతక్క పేర్కొన్నారు. తాను రాజకీయ కుటుంబం నుంచి రాలేదని, ములుగు జిల్లా జగ్గన్నపేట గ్రామానికి చెందిన ఆదివాసీ కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నానని తెలిపారు. తెలంగాణలో మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రంలో 46 లక్షలకు పైగా మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి సామాజిక, ఆర్థిక మార్పుకు దోహదపడుతున్నారని చెప్పారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీలు, రుణాల ద్వారా వారిని ఉద్యోగ సృష్టికర్తలుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

### నాయకత్వం వహించే స్థాయికి

ఇందిరా మహిళా శక్తి విధానం ద్వారా మహిళలకు పెద్ద స్థాయిలో వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు. స్వయం సహాయక సంఘాలు బస్సులు నిర్వహించడం, కమ్యూనిటీ క్యాంటీన్లు నడపడం, వరి కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటి అనేక రంగాల్లో ముందంజలో ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'ఇందిరా మహిళా శక్తి బజార్' ద్వారా గ్రామీణ మహిళలు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించే అవకాశం కల్పించామన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు బలపడతాయని, దేశ అభివృద్ధిలో మహిళలు కేవలం భాగస్వాములు మాత్రమే కాకుండా నాయకత్వం వహించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సంకల్పం, విద్య, ప్రజాస్వామ్యం ఏ జీవితాన్నైనా మార్చగలదని సీతక్క స్పష్టం చేశారు.

# నిర్భయ నిధికి ములుగు జిల్లా ఎంపిక

- **దేశవ్యాప్తంగా ఎంపికైన 10 జిల్లాల్లో చోటు దక్కించుకున్న ములుగు**
- **జిల్లాకు రూ.10 కోట్లు విడుదల.. కేంద్రమంత్రికి సీతక్క కృతజ్ఞతలు**

**న్యూఢిల్లీ, మార్చి 14:** నిర్భయ నిధి కింద కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సమ్మిళిత నగరాలు కార్యక్రమానికి ములుగు జిల్లా ఎంపికైందని మంత్రి సీతక్క తెలిపారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 10 జిల్లాల్లో తెలంగాణ నుంచి ములుగుకు అవకాశం లభించడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకోసం రూ.10 కోట్లు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. శనివారం ఢిల్లీలో కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవితో భేటీ అయిన సీతక్క.. జిల్లా ఎంపికపై కృతజ్ఞతలు తెలుపుతూనే అంగన్వాడీ, క్రెష్ సెంటర్ల సమస్యలను వివరించారు.

### వేతనాల పెంపుపై కేంద్రమంత్రి సానుకూలత

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబాల ఆర్థికాభివృద్ధికి క్రెష్ సెంటర్లు చాలా అవసరమని మంత్రి పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో వర్కర్లకు కేవలం రూ.5,000 మాత్రమే వేతనం ఉండటంతో సిబ్బంది కొరత ఏర్పడుతోందని చెప్పారు. వేతనాలు పెంచాలని చేసిన ప్రతిపాదనపై కేంద్రమంత్రి అన్నపూర్ణా దేవి సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,000 క్రెష్ సెంటర్లు పనిచేస్తున్నాయని వివరించారు.

### 15,000 అంగన్వాడీ పోస్టుల భర్తీకి కసరత్తు

త్వరలో రాష్ట్రంలో 15,000 అంగన్వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని సీతక్క ప్రకటించారు. ఉపాధి హామీ నిధులతో 2,000 అంగన్వాడీ భవనాల నిర్మాణం చేపడుతున్నామని, మౌలిక వసతుల కోసం బడ్జెట్ లో రూ.100 కోట్లు కేటాయించామన్నారు. అంగన్వాడీల్లో పిల్లలకు పాలతో పాటు త్వరలో బ్రేక్ ఫాస్ట్ కూడా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రిటైర్డ్ అంగన్వాడీ టీచర్లకు రూ.2 లక్షల వరకు ప్రయోజనాలు అందిస్తున్నామని, కేంద్రం కూడా వేతనాల్లో పెంపు చేపట్టాలని మంత్రి సీతక్క వెల్లడించారు.



# ఆయిల్ పామ్‌కు ఉజ్వల భవిష్యత్తు

## 22న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నర్మెట్ట ఫ్యాక్టరీ ప్రారంభం



- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**
- **టన్ను ధర 21 వేలకు పెంపు.. రైతులు భారీగా సాగు చేయాలని పిలుపు**

**సిద్దిపేట, మార్చి 14:** ఆయిల్ పామ్ పంటకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, రైతులు దండిగా ఈ సాగు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని మార్చి 22న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఆయన ఫ్యాక్టరీని సందర్శించి పనులను పరిశీలించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, పెట్టుబడి, ఎరువులు అన్నీ అందిస్తున్నామని తెలిపారు. తాను మంత్రిగా బాధ్యతలు తీసుకున్నప్పుడు టన్ను ధర 12 వేలు ఉంటే, కేంద్రంతో మాట్లాడి ఇప్పుడు 21 వేలకు పెంచామని చెప్పారు.

### నర్మెట్టలో 40 కోట్లతో రిఫైనరీ యూనిట్

ఈ పంటకు నీటి సమస్య, మార్కెట్ ఇబ్బందులు లేవని, అన్ని విధాలా లాభదాయకమని తుమ్మల పేర్కొన్నారు. రైతులు క్రాప్ డైవర్షన్ వైపు మళ్లాలని, లేకపోతే నష్టం జరుగుతుందని సూచించారు. సిద్దిపేట కేంద్రంగా 300 కోట్లతో ఈ ఫ్యాక్టరీ పనులను పూర్తి చేయించామని, ఇక్కడ 40 కోట్లతో రిఫైనరీ ఆయిల్ యూనిట్ కూడా ప్రారంభిస్తామని వివరించారు. రైతులు పండించిన వేస్టేజ్ గెలలతో విద్యుత్ తయారు చేస్తామని చెప్పారు. తన సొంత పొలంలో కూడా ఆయిల్ పామ్ సాగు చేస్తున్నానని, బాలకృష్ణ అనే దళిత రైతు ఈ పంటతో లాభాలు పొందుతున్నారని ఉదాహరణగా చెప్పారు. అంతర పంటలకు కూడా సబ్సిడీ ఇస్తామని, ప్రస్తుతం 30 జిల్లాల్లో ప్లాంటేషన్ జరుగుతోందని పేర్కొన్నారు.

### ప్రతి జిల్లాలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు కసరత్తు

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గుజరాత్ లోని అమూల్ పాల సేకరణ తరహాలో ఇక్కడ ఆయిల్ పామ్ వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. ప్రతి జిల్లాకు ఒక ఫ్యాక్టరీని ప్రారంభించాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని చెప్పారు. ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ పంట పండదు అనే అపోహను తుమ్మల నాగేశ్వరరావు తొలగించారని కొనియాడారు. ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా సురక్షితమైన ఈ పంటపై రైతులు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. త్వరలోనే అన్ని జిల్లాల రైతులను ఇక్కడికి పిలిచి అవగాహన కల్పిస్తామని మంత్రులు స్పష్టం చేశారు.

# బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర

**మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు 40 కిలోమీటర్ల పాదయాత్ర**

**కొండగట్టును అభివృద్ధి చేస్తామని కేంద్రమంత్రి హామీ**

**కరీంనగర్, మార్చి 14:**

కొండగట్టును అభివృద్ధి చేసే బాధ్యత తాము తీసుకుంటామని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర పేరిట కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు మహా పాదయాత్ర చేపట్టారు. కేంద్ర మంత్రితో పాటు ఇటీవల గెలుపొందిన కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు. కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీ కైవసమైతే కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కలిసి కొండగట్టు అంజన్న ఆలయానికి కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకుంటానని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బండి సంజయ్ ప్రకటించారు. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, 10000 మంది కార్యకర్తలతో కలిసి సంజయ్ పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

### బండి సంజయ్ బృందంపై తేనెటీగల దాడి

కేంద్ర మంత్రి బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్రలో అపశృతి చోటుచేసుకుంది. రామడుగు మండలం కోనరావుపేట వద్ద బండి సంజయ్ బృందంపై తేనెటీగలు దాడి చేశాయి. డ్రోన్ కెమెరా తేనెతుట్టెకు తగలడంతో ఈ ప్రమాదం జరిగి నలుగురు కార్యకర్తలు గాయపడ్డారు. రామడుగు మండలం కోనరావుపేట ప్రాంతంలో యాత్ర సాగుతుండగా డ్రోన్ ద్వారా ఫుటేజ్ తీసేందుకు కార్యకర్తలు ప్రయత్నించారు. ఈ క్రమంలో చెట్టుకు ఉన్న తేనెతుట్టెకు డ్రోన్ తగిలి తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. వెంటనే బండి సంజయ్, ఆయన సిబ్బంది అప్రమత్తమయ్యారు. యాత్రలో పాల్గొన్న కార్యకర్తలు భయాందోళనకు గురయ్యారు. గాయపడిన నలుగురు బీజేపీ కార్యకర్తలను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో పాదయాత్రకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడినా, అనంతరం తిరిగి మొదలైంది. కరీంనగర్ నుంచి కొండగట్టు వరకు 40 కిలోమీటర్ల మేర ఈ పాదయాత్ర సాగనుంది. సాయంత్రానికి సంజయ్ కొండగట్టుకు చేరుకోనున్నారు.

### రాజకీయాలకు సంబంధం లేదన్న కేంద్రమంత్రి

తన కొండగట్టు పాదయాత్ర రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని బండి సంజయ్ స్పష్టం చేశారు. అంజన్న ఆశీర్వాద పేరుతో శనివారం మహా పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కరీంనగర్ మహాశక్తి అమ్మవారి దేవాలయం నుంచి కొండగట్టు అంజన్న ఆలయం వరకు ఈ పాదయాత్ర కొనసాగుతోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని బీజేపీ ప్రజాప్రతినిధులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. 40 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగుతోంది. సాయంత్రం కొండగట్టుకు ఈ పాదయాత్ర చేరుకోనుంది. బీజేపీ శ్రేణులు ఈ పాదయాత్రకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పది వేల మంది పాల్గొనేలా ప్లాన్ చేశారు. కొండగట్టు అంజన్న ఆశీర్వాదం, ప్రజల ఆశీర్వాదంతో కరీంనగర్ కార్పొరేషన్‌లో విజయం సాధించామని బండి సంజయ్ పేర్కొన్నారు.

### విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా యాత్ర

పదోతరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ పాదయాత్ర కొనసాగుతోందని బండి సంజయ్ తెలిపారు.



ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నది ఎన్డీయే భాగస్వామ్య ప్రభుత్వమని గుర్తు చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమ ఎన్డీయే కూటమి మిత్రుడేనని తెలిపారు. కొండగట్టు అభివృద్ధికి టీటీడీ నిధులను పవన్ కల్యాణ్ కేటాయించారని ప్రస్తావించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు కొండగట్టు అభివృద్ధిని పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ప్రసాదం స్కీమ్ కింద కొండగట్టు, వేములవాడ, ఇల్లందకుంట ఆలయాలను అభివృద్ధి చేస్తామని కేసీఆర్ హయాంలో చెప్పారని, కానీ చర్యలు మాత్రం చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఐఎంను తాము భూస్థాపితం చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

### తుంగతుర్తి ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ఆగ్రహం

సర్వేజన సుఖీనోభవంతు మా నినాదం అని సంజయ్ చెప్పారు. తుంగతుర్తి ఎమ్మెల్యే బ్రాహ్మణుల మీద మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ హిందూ వ్యతిరేకి అని ఆరోపించారు. హిందువుల గురించి అనుచితంగా మాట్లాడే పరిస్థితి కాంగ్రెస్ సర్కార్‌లో వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మళ్లీ ఎలా గెలుస్తారో చూస్తామని హెచ్చరించారు. తుంగతుర్తిలో ఆయన పతనం ప్రారంభమైందని ధ్వజమెత్తారు. హిందూ దేవుళ్లను మోసం చేసి మరో దేవుడు దగ్గరకు ఆయన ఎలా వెళ్తారని ప్రశ్నించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మీద మత విద్వేషాలను రెచ్చగొట్టినందుకు కేసు పెట్టాలని ప్రభుత్వాన్ని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# తెలంగాణలో గ్యాస్ కొరత లేదు

మొదటి పేజీ తరువాయి

స్కూల్స్, కాలేజెస్, సెంటర్, స్టేట్ గవర్నమెంట్ సంస్థలకు కమర్షియల్ సిలిండర్లు విషయంలో ప్రాధాన్యత ఇస్తున్నాం. సివిల్ సప్లై భవన్ లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని. ఎవరైన కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించినా..బ్లాక్ మార్కెట్ చేసినా హెల్ప్ లైన్ 180042500344 కు కాల్ చేయొచ్చని' మంత్రి ఉత్తమ్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.3 కోట్ల మంది యాక్టివ్ గృహ వినియోగదారులు ఉన్నారని, వారికి సరిపడా సిలిండర్లను ఆయిల్ కంపెనీలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. గతంలో రోజుకు సగటున 2.15 లక్షల సిలిండర్లు సరఫరా అయ్యేవని, ప్రస్తుత డిమాండ్‌ను బట్టి దానిని 2.3 లక్షలకు పెంచినట్లు ఆయన వెల్లడించారు. గ్యాస్ కొరత ఉందన్న ఆందోళనతో వినియోగదారులు అనవసరంగా ఓవర్ బుకింగ్ చేసి సిస్టమ్‌ను ఓవర్‌లోడ్ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు వాడే 19 కేజీల కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం తగ్గుదల ఉన్న మాట వాస్తవమేనని మంత్రి అంగీకరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన కొత్త మార్గదర్శకాల వల్ల గతంలో ఉన్న సరఫరాలో కేవలం 20 శాతం మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉందని ఆయన వివరించారు. గతంలో రోజుకు 23,000 కమర్షియల్ సిలిండర్లు సరఫరా అయ్యే చోట, ఇప్పుడు కేవలం 6,200 మాత్రమే వస్తున్నాయని, ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్ పంపిణీ సక్రమంగా జరిగేలా చూడటంతో పాటు, అక్రమ నిల్వలను అరికట్టేందుకు రాష్ట్ర , జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. గృహ అవసరాల సిలిండర్లు పక్కదారి పట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటామని



ఆయన హెచ్చరించారు. మొత్తానికి, సామాన్యుడి వంటింట్లో మంట ఆరిపోకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని ఆయన భరోసా ఇచ్చారు.

# మూడు నెలల్లో సంక్షేమ భవనాలు

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం**

**వచ్చే విద్యాసంవత్సరం నాటికి కొత్త వసతి గృహాలు సిద్ధం**

**పెరిగిన డైట్, కాస్మోటిక్ చార్జీల చెల్లింపునకు ప్రాధాన్యం**



**హైదరాబాద్, మార్చి 14:** రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాల కోసం నిర్మిస్తున్న భవనాల్లో 80 శాతం పనులు పూర్తయిన వాటిని యుద్ధ ప్రాతిపదికన రాబోయే మూడు నెలల్లో పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఈ భవనాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి సంక్షేమ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, వసతి గృహాల మరమ్మతుల బిల్లులు ప్రతి 15 రోజులకు ఒకసారి క్రమం తప్పకుండా ఆర్థిక శాఖకు వచ్చేలా పర్యవేక్షించేందుకు ఒక సీనియర్ అధికారిని నియమించాలని సూచించారు. "ఈ వేసవి సెలవుల్లోనే హాస్టళ్ల మరమ్మత్తు పనులన్నీ పూర్తి కావాలి. ఇందులో అధికారుల నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోము" అని ఆయన హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో ఏడు నెలలకోసారి బిల్లులు చెల్లించేవారని, కానీ తమ ప్రభుత్వం హాస్టల్ అద్దెలు, ఎలక్ట్రికల్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు మరియు అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలను ప్రతి నెలా చెల్లించేలా చర్యలు తీసుకుంటోందని భట్టి వివరించారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ఇప్పటికే డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచామని, వీటికి సంబంధించిన బిల్లులకు ఆర్థిక శాఖ మొదటి ప్రాధాన్యత ఇస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు. హాస్టళ్లకు సరఫరా అయ్యే వస్తువుల నాణ్యతను తనిఖీ చేసేందుకు ఒక నిర్దిష్ట యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో బోధన, భోజనం మరియు వసతుల నాణ్యతను పరిశీలించేందుకు అధికారులు తరచూ వసతి గృహాలను సందర్శించి, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ కొరత లేదు

**బాటిళ్లలో వాటిని సరఫరా చేస్తే కఠిన చర్యలు**

**తమిళనాడు ఘటనలో డీలర్‌షి రద్దు చేసిన కేంద్రం**

**ఇంధన సరఫరాలపై పెట్రోలియం శాఖ కీలక ఆదేశాలు జారీ**



**న్యూఢిల్లీ, మార్చి 14:** పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇంధన కొరత ఏర్పడుతుందంటూ జరుగుతున్న ప్రచారానికి తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ముందు జాగ్రత్తగా పెట్రోల్ , డీజిల్ ను.. సీసాలు, డబ్బాలు లాంటి విడి పాత్రలలో నిల్వ చేసుకోవడంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన జారీచేసింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. ఇటీవల తమిళనాడులోని ఒక రిటైల్ అవుట్‌లెట్‌లో వినియోగదారుడికి లూజ్ కంటైనర్‌లో పెట్రోల్ పోసిన విషయం తమ దృష్టికి వచ్చిందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది భద్రతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, అందుకే ఆ పెట్రోల్ బంక్ లైసెన్స్‌ను తక్షణమే సస్పెండ్ చేసి, సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకున్నామని వెల్లడించింది. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్‌లు, డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. ఇంధనాన్ని సరఫరా చేసేటప్పుడు భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పెట్రోల్ వంటి మండే స్వభావం ఉన్న ఇంధనాన్ని అసురక్షిత పద్ధతుల్లో నిల్వ చేయడంవల్ల తీవ్రమైన అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం సూచించింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ తాజాగా కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదని భరోసా ఇచ్చింది. కంగారు పడి కొనుగోళ్లకు దిగవద్దని ప్రజలకు సూచించింది. సాధారణ కంటెయినర్‌లలో పెట్రోల్, డీజిల్ నిల్వ చేయడం ప్రమాదకరమని హెచ్చరించింది. ఇక గృహవినియోగ ఎల్‌పీజీ సిలిండర్‌ల విషయంలో నెలకొన్న భయాందోళనలపై ఇటీవల మార్కెటింగ్ ఆయిల్ రిఫైనరీ విభాగం జాయింట్ సెక్రెటరీ కూడా స్పందించారు. ఎల్‌పీజీ డెలివరీల్లో ఎలాంటి ఆటంకాలు లేవని అన్నారు. గ్యాస్ ఉత్పత్తిని భారతీయ రిఫైనరీలు 30 శాతం మేర పెంచాయని అన్నారు. గృహ వినియోగదారులు, ఆసుపత్రులు, విద్యాసంస్థలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ జాగ్రత్త తీసుకున్నట్టు తెలిపారు. ఇక కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌లకు సంబంధించిన వ్యవహారాల నిర్వహణను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు బదిలీ చేసింది. కీలక రంగాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సరఫరా జరిగేలా మార్గదర్శకాల రూపకల్పన, అమలు బాధ్యతలను రాష్ట్రాలకు బదిలీ చేసింది.

# దళిత అమ్మాయికి మోసం

**ఎమ్మెల్యే పీఏ అరెస్ట్**



**జయశంకర్ భూపాలపల్లి, మార్చి 14:** భూపాలపల్లి ఎమ్మెల్యే పీఏ శ్రీనివాస్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఓ దళిత యువతిని ప్రేమపేరుతో మోసం చేశాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎమ్మెల్యే కు పర్సనల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్.. హనుమకొండలో పరిచయమైన చిట్యాల మండలానికి చెందిన ఓ దళిత అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. చాలాకాలంగా ప్రేమించుకోవడంతో పాటు పెండ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అంతలోనే ఓ పోలీస్ కుటుంబానికి చెందిన అమ్మాయితో పెండ్లి సంబంధం కుదుర్చుకున్నాడు. విషయం తెలుసుకున్న బాధిత అమ్మాయి కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌పై చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్ద మనుషుల పంచాయితీలో సైతం శ్రీనివాస్ అమ్మాయితో పెండ్లికి నిరాకరించాడు. దీంతో అతడిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు అమ్మాయిని మోసం చేసిన కేసులో రిమాండ్‌కు పంపినట్టు చిట్యాల సీఐ మల్లేశ్ యాదవ్ తెలిపారు.

# పదో తరగతి పరీక్షలు ప్రారంభం

**దుఃఖాన్ని దిగమింగి పరీక్ష రాసిన విద్యార్థులు**

**హైదరాబాద్, మార్చి 14:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 2,676 కేంద్రాల్లో మొత్తం 5,28,239 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన ఈ పరీక్షలు ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి. అధికారులు అరగంట ముందుగానే విద్యార్థులను లోపలికి అనుమతించగా, ఐదు నిమిషాల గ్రేస్ టైమ్‌ను కూడా అమలు చేశారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 144 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించినట్లు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు.

**పుట్టెడు దుఃఖంలో పరీక్ష...**

మరోవైపు రాష్ట్రంలోని పలు చోట్ల హృదయ విదారక ఘటనలు చోటుచేసుకున్నాయి. తండ్రి మరణించిన పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా ఇద్దరు విద్యార్థులు పరీక్షలకు హాజరై అందరినీ కంటతడి పెట్టించారు. మెదక్ జిల్లా పాంబండ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఇంట్లో తండ్రి అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతుండగానే ఆయన కుమారుడు ధనుశ్ పట్టుదలతో పరీక్షా కేంద్రానికి వచ్చాడు. అలాగే యాదాద్రి జిల్లా మోత్కూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎల్లయ్య గుండెపోటుతో మరణించగా, ఆయన కుమారుడు హర్షవర్ధన్ శోకసంద్రంలో ఉండి కూడా పరీక్ష రాసి, మధ్యాహ్నం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొని తలకొరివి పెట్టాడు.

**ఒకే ఒక్కడు..**

ఇక నాగర్‌కర్నూలు జిల్లాలో అధికారులను విస్తుపోయేలా చేసిన ఒక విచిత్ర సంఘటన జరిగింది. బ్రిడ్జి కోర్సు పరీక్ష కోసం వరుణ్ సందేశ్ అనే విద్యార్థి ఒక్కడే దరఖాస్తు చేసుకోవడంతో, అధికారులు నిబంధనల



ప్రకారం జిల్లాలో ప్రత్యేకంగా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఒక్క విద్యార్థి కోసం ఒక ఇన్విజిలేటర్, సూపరింటెండెంట్, ప్రత్యేక పోలీస్ బందోబస్తును కూడా కేటాయించారు. అయితే తీరా పరీక్ష సమయానికి సదరు విద్యార్థి గైర్హాజరు కావడంతో అధికారుల శ్రమ, ఏర్పాట్లు అన్నీ వృథా అయ్యాయి. మొత్తం మీద తొలిరోజు పదో తరగతి పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా ముగిశాయి.




# ప్రేమ పేరుతో ఎయిడ్స్ రోగి వికృతి చేష్టలు

**పెళ్లికి నిరాకరించిన యువతికి ఎయిడ్స్ ఇంజెక్షన్**

**ఫిర్యాదుతో రంగంలోకి దిగి అరెస్ట్ చేసిన పోలీసులు**

**మేడ్చల్ మల్కాజ్‌గిరి, మార్చి 14:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పోచారం ప్రాంతంలో సమాజం తలదించుకునే ఘటన చోటుచేసుకుంది. తనను పెళ్లి చేసుకోవడం లేదనే కోపంతో ఓ యువకుడు, యువతికి ప్రాణాంతకమైన ఎయిడ్స్ సోకిన రక్తాన్ని ఇంజక్షన్ ద్వారా ఎక్కించాడు. సినిమా తరహాలో జరిగిన ఈ పైశాచిక ఘటన ఇప్పుడు కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు మనోహర్, బాధితురాలిని కొంతకాలంగా పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడు. మనోహర్‌కు ఎయిడ్స్ పాజిటివ్ ఉందని తెలియడంతో ఆ యువతి అతడితో పెళ్లికి నిరాకరించింది. తన ప్రాణాలను పణంగాపెట్టి పెళ్లి చేసుకోలేనని స్పష్టం చేసింది. తన వ్యాధి గురించి తెలిసి పెళ్లికి నో చెప్పిందనే కోపంతో మనోహర్ ఉన్మాదిలా ప్రవర్తించాడు. 'నేను ఎలాగూ చనిపోతాను.. నువ్వు కూడా నాతోనే రావాలి' అనే వికృత ఆలోచనతో, తన రక్తాన్ని లేదా ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల రక్తాన్ని ఇంజక్షన్ ద్వారా ఆ యువతి శరీరంలోకి ఎక్కించాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఘట్‌కేసర్ పోలీసులు వెంటనే స్పందించారు. మనోహర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ రక్తాన్ని అతను ఎక్కడి నుంచి సేకరించాడు? దీని వెనుక ఇంకెవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. బాధితురాలిని వెంటనే ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రేమ పేరుతో ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడే వారిపై కఠిన చట్టాలు ప్రయోగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. బాధితురాలు త్వరగా కోలుకోవాలని స్థానికులు ఆకాంక్షించారు.

# పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్‌కు స్వేచ్ఛ

**నిర్బంధాన్ని రద్దు చేస్తూ హోంశాఖ ఉత్తర్వులు**

**న్యూఢిల్లీ, మార్చి 14:** పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ నిర్బంధాన్ని రద్దు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ప్రకటన విడుదల చేసింది. దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన జైలు నుంచి విడుదల కానున్నారు. లద్దాఖ్ కు రాష్ట్ర హోదా డిమాండ్ చేస్తూ గతేడాది లేహ్ ప్రాంతంలో అల్లర్లు జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జరిగిన హింసాత్మక ఘటనల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది గాయపడ్డారు. ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ పిలుపుతోనే ఈ ఆందోళనలు జరిగాయని కేంద్రం వెల్లడించింది. ఈ క్రమంలోనే జాతీయ భద్రత చట్టం కింద అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. శాంతి భద్రతలను కాపాడాలనే ఉద్దేశంతో కస్టడీలోకి తీసుకున్నట్లు హోంశాఖ ప్రకటనలో వెల్లడించింది. లద్దాఖ్‌లో శాంతికి కట్టుబడి ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించింది. ఈ క్రమంలో వాంగ్‌చుక్ నిర్బంధాన్ని తక్షణమే రద్దు చేయాలని నిర్ణయించినట్టు పేర్కొంది. అయితే, ప్రస్తుతం కొనసాగుతున్న బంద్‌లు, నిరసనల వాతావరణం శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నాయని అభిప్రాయపడింది.

# మద్నూర్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు

**ముస్లిం సోదరులతో కలిసి ఉపవాసం విడిచిన ఎమ్మెల్యే కాంతారావు**

**రాష్ట్రంలో సుఖసంతోషాలు వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు**



**మద్నూర్, మార్చి 14 (ఇదే నిజం):**

కామారెడ్డి జిల్లా మద్నూర్, డోంగ్లీ మండలాల ముస్లిం సోదరుల కోసం మద్నూర్ మార్కెట్ కార్యాలయ ఆవరణలో శనివారం సాయంత్రం దావతే ఇఫ్తార్ పార్టీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాంతారావు హాజరయ్యారు. సాయంత్రం 6:34 నిమిషాలకు ముస్లిం సోదరులు ప్రార్థనలు చేసి ఉపవాసాన్ని విడిచిపెట్టారు. కాంగ్రెస్ నాయకులు జావీద్ పటేల్, సాలే మియా ఎమ్మెల్యేకు ఖర్జూరం తినిపించి ఇఫ్తార్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

**శాంతి, సోదరభావం వెల్లివిరియాలి**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాంతారావు మాట్లాడుతూ.. రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు కఠిన ఉపవాసాలు ఉంటూ అల్లాహ్ పట్ల భక్తిని చాటుకుంటారని కొనియాడారు. ఇఫ్తార్ విందుల ద్వారా దేశంలో శాంతి, సోదరభావం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వం మరో 20 ఏళ్లు విజయవంతంగా సాగాలని ఈ ప్రార్థనల్లో వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ధరస్వార్ సాయిలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, సర్పంచ్ భర్త సంతోష్ మేస్త్రి, ఉప సర్పంచ్ వాటనల్ వార్ రమేష్, మీర్జాపూర్ ఆలయ చైర్మన్ రామ్ పటేల్ పాల్గొన్నారు. అలాగే నాయకులు హన్మాండ్లు స్వామి, సాలే మియా, జావీద్ పటేల్, చాంద్ పటేల్, అఫ్సర్ పటేల్, మస్జీద్ సదార్ ఏజాస్ ఖాన్, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ పటేల్, డోంగ్లీ అధ్యక్షుడు గజానంద్ దేశాయి, సంగయప్ప, ఉమ్మడి మండలాల సర్పంచులు, ఉప సర్పంచులు, ముస్లిం సోదరులు హాజరయ్యారు.



సంపాదకీయం

# అసెంబ్లీలో ప్రధాన సమస్యలు అజెండా కావాలి!

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 16న సోమవారం నుంచి ప్రారంభం కాబోతున్నాయి. సమస్యలు అనేకం ఉన్నాయి. సమస్యలపై చిత్తశుద్ధితో చర్చించాలి. ప్రజల కోణంలో సమస్యలపై చర్చలు జరగాలి. అంతే తప్ప అధికార, విపక్షాల మాటల యుద్ధానికి అసెంబ్లీ వేదిక కారాదు. తెలంగాణ ఏర్పాడి 12 ఏళ్లు కావస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. నాయకులు బాగుపడుతున్నారే తప్ప ప్రజలు బాగు పడడం లేదు. జీతాలకు డబ్బులు లేవు. ఉన్న డబ్బులు మిత్తీలకు సరిపోవడం లేదు. ట్రిలియన్ ఎకానమీ మాటలు మాట్లాడే ముందు, అప్పులను కంట్రోల్ చేయడం, దుబారా ఖర్చులను తగ్గించడం, ఉయిత పథకాలపై సమీక్షించడం అవసరం. ఖమ్మం జిల్లా వెలుగమట్లలో అన్యాయంగా పేదల ఇళ్ళు కూల్చి వారిని రోడ్డున పడేశారు. దానికి సమాధానం చెప్పాలి. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో ఇంతటి ఘోరం జరగడం దుర్మార్గం కాకపోతే మరోటి కాదు. అందులో కేవలం ఓ 300 పైచిలుకు మందికి పట్టాలు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. ఇల్లున్న వారందరినీ కూర్చుండబెట్టి చర్చిస్తే సమస్య వచ్చేది కాదు. దీనిపై సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిస్పందన వ్యక్తం చేయలేదు. ఇకపోతే ప్రభుత్వ ప్రధాన ఎజెండాగా మూసీ ప్రక్షాళన ముందుకు వచ్చింది. మూసీని ప్రక్షాళన చేయాల్సిందే. అక్రమాలను తొలగించాల్సిందే. హైదరాబాద్‌కు విముక్తి కలగించాల్సిందే. దీనిపై పారదర్శకత ముఖ్యం. గతంలో కాళేశ్వరం నిర్మించిన కెసిఆర్ ఎలాంటి పారదర్శక లేకుండా నిర్మాణం చేయడం వల్ల లక్షకోట్లు గోదాట్లో పోసినట్లు అయ్యింది. ప్రజలు చెమటోడ్చి కడుతున్న పన్నులను ఇలా దుబారా చేయడం క్షమించరాని నేరం. ఇప్పుడు మూసీ ప్రక్షాళన కూడా అలా కాకూడదు. అందువల్ల దీనిప అఖిలపక్షంతో పాటు, పర్యావం-ణవేత్తలతో కమిటీలు వేసి చర్చించాలి. అలాగేఅసెంబ్లీలో సమగ్రంగా చర్చించాలి. నిర్మోహ మాటంగా ఎలా ప్రాజెక్టును ముందుకు తీసుకుని వెళ్లాలనుకుంటున్నారో అసెంబ్లీ ద్వారా ప్రజలకు తెలియ చేయాలి. లండన్, దక్షిణ కొరియా, పారిస్, సింగపూర్, దుబాయ్, జపాన్ ఇలా అనేక రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుల స్ఫూర్తితో మూసీ నదీ పరీవాహకం ప్రక్షాళనతో పాటు భారీ ఎత్తున ఆకాశహర్మ్యాల మధ్య వెలుగులు విరజిమ్మితే అంతకంటే కావాల్సిందేముంది. అయితే ఇది ఎంతవరకు సాధ్యమో ఆలోచించాలి. మూసీలో ఉన్న శ్మశాన వాటికలు, పక్కను ఉన్న ప్రార్థనా మందిరాలు తొలగంచకుండా ముందుకు సాగడం కష్టం. బాపూఘాట్ నుంచి గౌరెల్లి వరకు 200 మీటర్ల వెడల్పుతో విస్తరించనున్న నదికి రెండువైపులా హోటళ్లు, రెస్టారెంట్లు, వినోద కేంద్రాలు, రాత్రి మార్కెట్లతో జిగేల్ మనిపించేందుకు రేవంత్ సర్కార్ రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు ఇచ్చిన మూసీ సుందరీకరణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చూస్తే అద్భుతంగా ఉంది. కొత్త చరిత్రను లిఖించేందుకు పరీవాహకంలోని నిరుపేదలంతా తమ ఇండ్లు త్యాగం చేయాలని పిలుపు నిచ్చింది. ఈ క్రమంలో ఇక్కడ నివిస్తున్న పేదలు కావచ్చు, ఆక్రమణదారులు కావచ్చు వారిని తరిలిస్తే ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలి. భూములు, ఇండ్లు కోల్పోతున్న బాధితుల గోడు పట్టించుకోవాలి. ప్రాజెక్టు సమగ్రంగా ముందుకు సాగేందుకు పర్యావరణవేత్తలు, మేధావుల సలహాలు తీసుకుని సాగాలి. పెట్టుబడులు రాబట్టి నైట్ మార్కెట్‌తో మూసీ పరీవాహకాన్ని రియల్ వ్యాపారంతో కూడిన ఆర్థిక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్న ఆరోపణలపై గట్టిగా సమాధానం ఇవ్వాలి. జంట జలాశయాల నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మూసీ సుందరీకరణకు నది రెండువైపులా బఫర్‌జోన్ వరకు కూల్చివేసే ఇండ్లు, నిర్మాణాలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ముందుగా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. వారికి కొత్తగా ఇళ్లు కట్టి ఇవ్వాలి. మూసీ ప్రాజెక్టుకు మొత్తంగా 3 వేలకు పైగా ఎకరాలు సేకరించి, 10,017 ఇండ్లే కూల్చివేయనున్నట్టు ప్రభుత్వం 2025, డిసెంబర్‌లో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కేసీఆర్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన కోసం ఏటా ఐదు టీఎంసీల గోదావరి జలాలను జంట జలాశయాలకు తరలించాలనే ప్రణాళిక వేసింది. కాంగ్రెస్ మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీలు తరలించి అందు లో 15 టీఎంసీలను నగర తాగునీటి కోసం, మిగిలిన ఐదు టీఎంసీలు మూసీ ప్రక్షాళనకు మళ్లిస్తామని చెప్పింది. ఆ మేరకు టెండర్లు పూర్తి చేసి పనులు కూడా అప్పగించింది. కానీ అది అమల్లోకి రాలేదు. సరికదా కాళేశ్వరంతో భారీగా దోపిడీ ప్రాజెక్ట్ తెరముందుకు వచ్చింది. ఇప్పుడది గుదిబండగా మారింది. మూసీ సుందరీకరణ పేరిట సర్కార్ బఫర్ జోన్‌ను కూడా చెరపట్టేందుకు సిద్ధమైందని పీపీటీలో తేలింది. మూసీ బఫర్ జోన్ పరిధిలోనే మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ ఉన్నదనీ, ఈ భవనమే అక్రమమని, దాన్ని ఖాళీ చేయాలని సర్కార్ చెప్తున్నది. అదే బఫర్ జోన్‌లో భారీ నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించింది. మూసీ మధ్యలోనే గాంధీ సరోవర్ పేరిట అతిపెద్ద టవర్, ఇతర భవనాలు కట్టనున్నట్టు పీపీటీ ద్వారా స్పష్టమైంది. ప్రాజెక్టు విషయంలో మధు రిడ్జ్ అపార్ట్‌మెంట్‌కు వర్తించిన బఫర్ జోన్ నిబంధనలు, రివర్ బెడ్‌లోనే కడుతున్న భారీ నిర్మాణాలకు, పక్కనే ఉండే భారీ రాట్నం, 20 అంతస్తుల్లో నిర్మించే భవనాలకు వర్తించవా? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. అలాగే నార్సింగ్‌లో కడుతున్న బహుళ అంతస్తు మూసీలోనే ఉన్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆందోళనలు చేశారు. కవిత ఇక్కడ ధర్నా కూడా చేపట్టారు. ఇవన్నీ కూడా చర్చించాల్సిన అంశాలు. ప్రభుత్వం దాపరికం లేకుండా అన్ని విషయాలు అసెంబ్లీ ముందు పెట్టాలి. సమగ్రంగా చర్చించాలి. వీటికి సమాధానం కూడా చెప్పాలి.

# మొజ్తబా ఆచూకీ చెబితే.. .10మిలియన్ డాలర్లు

- రివార్డ్ ఫర్ జస్టిస్ ప్రకటించిన అమెరికా



**వాషింగ్టన్, మార్చి 14:** ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరు పగ్గాలు చేపట్టినా తమ తదుపరి టార్గెట్ అయనే అవుతారని ఇంతకుముందే ప్రకటించిన అమెరికా ఆ దిశగా మరో ముందడుగు వేసింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆచూకీ కానీ, ఆయనకు సంబంధించిన కీలక సమాచారం కానీ అందించిన వారికి భారీ రివార్డు ప్రకటించింది. ఆచూకీ ఇచ్చిన వారికి 10 మిలియన్ డాలర్లు అంటే రూ.92 కోట్లు నజరానా ఇస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. 'రివార్డ్ ఫర్ జస్టిస్' కార్యక్రమం క్రింద ఈ బౌంటీ ఇస్తామని తెలిపింది. అమెరికా విదేశాంగ నిర్వహించే ఒక ముఖ్యమైన ఉగ్రవాద నిరోధక కార్యక్రమమే 'రివార్డ్ ఫర్ జస్టిస్'. ఈ ప్రోగ్రాం కింద అంతర్జాతీయ నేరస్తులు, నెట్‌వర్క్‌ల సమాచారం అందించి, వారిని పట్టుకోవడంలో సహాయపడిన వారికి మిలియన్ డాలర్ల రివార్డు ఇస్తుంటారు. అమెరికన్ల రక్షణ, జాతీయ భద్రత బలోపేతం చేయడమే ఆర్ఎఫ్‌జే లక్ష్యం. కాగా, అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించిన వ్యక్తుల జాబితా మొజ్తాబాతో పాటు ఆయన కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అలీ అస్గర్ హెజాజీ, సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్ అలీ లారీజానీ, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. ఆచూకీ తెలిపిన వారికి రివార్డుతో పాటు వారిని వేరే ప్రాంతానికి తరలించే సదుపాయం కూడా కల్పిస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది.

# భయపడకండి

- యుద్ధం ఎఫెక్ట్‌పై భయాందోళనలు సృష్టిస్తున్న కాంగ్రెస్
- మోదీని దూషించడమే పనిగా పెట్టుకుంది
- అస్సాంలో ప్రధానమంత్రి మోదీ




**సిల్చార్, మార్చి 14:** దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించాల్సింది పోయి, కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. శనివారం అస్సాంలోని సిల్చార్‌లో పర్యటించిన ఆయన, సుమారు రూ.23,500 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా రూ.22,864 కోట్లతో నిర్మించనున్న సిల్చార్ - షిల్లాంగ్ యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ.. మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల ప్రభావం భారత్‌పై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. అయితే, కాంగ్రెస్ పార్టీ దేశ ప్రయోజనాల పరిరక్షణలో విఫలమవ్వడమే కాకుండా, అంతర్జాతీయ శక్తుల చేతిలో కీలుబొమ్మగా మారి మోదీని దూషించడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. భారతదేశం సాధిస్తున్న శీఘ్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక కొన్ని శక్తులు అబద్ధాలు, వదంతులతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి అస్సాం అభివృద్ధి గురించి కానీ, దేశ భవిష్యత్తు గురించి కానీ ఎలాంటి విజన్ లేదని మోదీ తప్పుపట్టారు. గతంలో అస్సాం ప్రజలను హింస, ఉగ్రవాదం వైపు నడిపించిన కాంగ్రెస్ పాలనకు భిన్నంగా, నేడు బీజేపీ ప్రభుత్వం యువతకు సమృద్ధిగా అవకాశాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. "కాంగ్రెస్ ఆలోచనలు ఎక్కడ ఆగిపోతాయో, అక్కడి నుంచే మా అభివృద్ధి పని ప్రారంభమవుతుంది" అని వ్యాఖ్యానించిన ఆయన, వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడమే తమ ప్రభుత్వ ప్రధాన మంత్రమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో అస్సాం ముఖ్యమంత్రి సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# అమెరికాలో వీసా మోసాలు


- 11 మంది భారతీయుల అరెస్ట్
- నేరం రుజువైతే జైలుశిక్ష తప్పదు




**వాషింగ్టన్, మార్చి 14:** అమెరికాలో కొందరు భారతీయులు అక్రమంగా నివసించేందుకు చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) ఛేదించింది. వీసా మోసానికి కుట్ర పన్నారనే ఆరోపణలపై నాలుగు రాష్ట్రాల్లో చేపట్టిన ఆపరేషన్‌లో 11 మందిని అరెస్ట్ చేసింది. సదరు వ్యక్తులు నేర బాధితులుగా డ్రామాలాడి, ఇమ్మిగ్రేషన్ పొందేందుకు సాయుధ దోపిడీలకు పాల్పడ్డారని ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఎఫ్‌బీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ముఠా ప్రణాళికలో భాగంగా మసాచుసెట్స్ రాష్ట్రంలోని లిక్కర్ షాప్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కన్వీనియెన్స్ స్టోర్లలో నకిలీ దోపిడీలు జరుగుతాయి. ఈ డ్రామాలో ఓ వ్యక్తి ఆయుధంతో షాపులోకి ప్రవేశించి అక్కడి గుమాస్తాను బెదిరించి నగదుతో ఉడాయించగా.. ఇదంతా సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అవుతుంది. ఈ విషయం కాస్త ఆలస్యంగా పోలీసులకు తెలుస్తుంది. ఆ తర్వాత దొంగ దొరక్కుండా జాగ్రత్తపడతాడు. స్టోర్‌లో దోపిడీ నిర్వహించేందుకు యజమాని, అలాగే బాధితుడిగా నటించినందుకు గుమాస్తాకు డబ్బులు చెల్లిస్తారు. ఈ డ్రామా అంతా పూర్తయ్యాక తామే ఈ దోపిడీ చేశామని పోలీసులకు సమాచారమిచ్చి.. ఆ సాక్ష్యాలతో 'యు' నాన్ ఇమిగ్రెంట్ వీసాకు దరఖాస్తు చేసుకుంటుంటారు. అయితే.. మొత్తం వ్యవహారాన్ని రాంభాయ్ పటేల్ అనే వ్యక్తి నడిపిస్తున్నారని తెలుస్తోంది. ఇలా వీసాలు పొందేందుకు బాధితులుగా నటించేవారు అతడికి భారీగా డబ్బులిస్తారని సమాచారం. అతడే ఈ ప్లాన్‌ను అమలు చేస్తుంటాడు. కాగా.. రాంభాయ్ పటేల్, అతడి డ్రైవర్‌ను అధికారులు ఇప్పటికే పట్టుకున్నారు. ప్రస్తుతం అరెస్టయిన వారిలో జితేంద్ర కుమార్ పటేల్, మహేశ్ కుమార్ పటేల్, సంజయ్ కుమార్ పటేల్, అమితాబెన్ పటేల్, సంగీతాబెన్ పటేల్, మితుల్ పటేల్, రమేష్‌భాయ్ పటేల్, రోనక్ కుమార్ పటేల్, సోనాల్ పటేల్, మింకేశ్ పటేల్ ఉన్నారు. వీరిని బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టులో హాజరుపరచనున్నట్టు తెలుస్తోంది. వీసా మోసానికి పాల్పడినట్టుగా నేరం రుజువైతే.. మూడేళ్ల జైలు శిక్ష, 2.50 లక్షల డాలర్లు భారత కరెన్సీలో సుమారు రూ.2.10 కోట్లు భారీ జరిమానా విధించే అవకాశం ఉంది.

# కిమ్ కవ్వింపులు

## ఒకేసారి 10 క్షిపణులు ఫైర్



**న్యూ ఢిల్లీ:** అమెరికా-దక్షిణ కొరియా వార్షిక సైనిక విన్యాసాల వేళ ఉత్తరకొరియా కవ్వింపులకు పాల్పడుతోంది. వరుసగా క్షిపణి ప్రయోగాలు చేపడుతూ బలప్రదర్శనకు దిగింది. శనివారం ఏకంగా 10 క్షిపణులను ఓకేసారి ప్రయోగించింది. ఈ విషయాన్ని దక్షిణ కొరియా మిలిటరీ వెల్లడించింది. ఉత్తరకొరియా రాజధాని ప్యాంగ్యాంగ్ సమీపం నుంచి ఈ క్షిపణులను ప్రయోగించినట్లు దక్షిణ కొరియా తెలిపింది. అయితే, ఇవి ఎంతదూరం ప్రయాణించాయో తమకు తెలియదని పేర్కొంది. మరోవైపు, జపాన్ రక్షణ శాఖ ఈ పరిణామాలపై స్పందించింది. కిమ్ సర్కారు ప్రయోగించిన ఆయుధాలు తమ దేశ ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్ వెలుపల ఉన్న సముద్ర జలాల్లో పడినట్లు తెలిపింది. ఈ వారం ఆరంభంలోనూ ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం చేపట్టింది. ఓ యుద్ధనౌక నుంచి తన తీరానికి సమీపంలోని దీవులపై క్రూజ్ క్షిపణులను ప్రయోగించింది. ఆ ప్రయోగ పరీక్షలను ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్, తన 13 ఏళ్ల కుమార్తె కిమ్ జు యేతో కలిసి కాన్ఫరెన్స్ హాలులో కూర్చుని వీక్షించినట్లు ఆ దేశ ప్రభుత్వ మీడియా సంస్థ వెల్లడించింది. తమ దేశంపై అణ్వస్త్ర దాడి ముప్పును నిరోధించడానికే ఈ శక్తిమంతమైన క్షిపణులతో ప్రయోగాలు చేస్తున్నట్లు కిమ్ ఇప్పటికే ప్రకటించారు.

# ఖర్గ్ ఐలాండ్‌పై దాడి..

## అమెరికాకు ఇరాన్ వార్నింగ్

**ఢిల్లీ:** ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే లక్ష్యంగా.. ఖర్గ్ ఐలాండ్ పై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఆ ద్వీపంలోని సైనిక స్థావరాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. తాజాగా ఈ దాడులను ఇరాన్ కూడా ధ్రువీకరించింది. అయితే, చమురు మౌలిక సదుపాయాలకు ఎలాంటి హాని కలగలేదని వెల్లడించింది. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ.. యూఎస్‌కు గట్టి హెచ్చరికలు చేసింది. ఇరాన్ మీడియా ప్రకారం.. ఖర్గ్ ఐలాండ్‌పై జరిగిన దాడుల గురించి ఇరాన్ సాయుధ దళాల కార్యాలయం ప్రతినిధి ఓ ప్రకటనలో స్పందించారు. 'మా చమురు మౌలిక సదుపాయాలపై జరిగే ఏ దాడినైనా తీవ్రంగా పరిగణిస్తాం. అలా చేస్తే ఈ ప్రాంతంలో అమెరికాతో సంబంధం ఉన్న చమురు కంపెనీల మౌలిక సదుపాయాలు తుడిచిపెట్టుకుపోతాయి. వాటిని బూడిద కుప్పలుగా మార్చేస్తాం' అని హెచ్చరించారు. ఇక, ఇరాన్ చమురుకు వ్యూహాత్మక హబ్ అయిన ఖర్గ్ ఐలాండ్‌పై తన ఆదేశాల మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ దాడి చేసిందని ట్రంప్ పేర్కొన్నారు. ఇక్కడి చమురు సదుపాయాల జోలికి వెళ్లలేదని వెల్లడించారు. హర్మూజ్ జలసంధి వద్ద నౌకల రవాణాను అడ్డుకుంటే మాత్రం.. వాటిని కూడా టార్గెట్ చేస్తామని హెచ్చరికలు జారీచేశారు.



# మరింత దిగజారిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ, మార్చి 14:** అంతర్జాతీయంగా అనిశ్చితి కారణంగా స్టాక్ మార్కెట్లు, రూపాయి విలువతో పాటు బంగారం, వెండి ధరలు కూడా మరింత కిందకు దిగివస్తున్నాయి. శనివారం కూడా బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడమే బంగారం, వెండి తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది. శనివారం ఉదయం 10:10 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,59,660కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.1030 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,350 దగ్గర ఉంది . నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.950 మేర తగ్గింది. రోవైపు వెండి ధరలు కూడా శనివారం తగ్గుదల నమోదు చేశాయి. వెండి కిలోకు రూ.4,900 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.75 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.8 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.



## పశ్చాత్తాపపు ప్రార్థనల వాతావరణం

రంజాన్ మాసంలో సాయంత్రం నుంచి రాత్రివేళ వరకు మసీదులలో ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తుంది. ఇఫ్తార్ ముగిసిన వెంటనే విశ్వాసులు నమాజ్ కోసం మసీదులకు చేరుకుంటారు. నమాజ్ అనంతరం ప్రార్థనలో మునిగిపోయిన భక్తులు అల్లా ముందు తమ హృదయాల ముడి విప్పి మౌనంగా చెప్పుకుంటారు. గతంలో..తెలిసి చేసినవో..తెలియక చేసినవో.. అనుకోకుండా జరిగివో తప్పుల జ్ఞాపకాలు మనసును తాకినప్పుడు కొందరి కళ్లలో నీరు జారిపడుతుంది.! 'మా తప్పులను క్షమించు.. మాకు మరో అవకాశం ఇవ్వు' అనే వినమ్ర వినతులు గాలిలో కలిసిపోతాయి. కొందరి కన్నీళ్లు నిశ్శబ్దంగా చెంపలపై జారుతుంటే, మరికొందరు లోలోపల కుమిలిపోతూ అల్లా కరుణ కోసం ప్రార్థిస్తారు.!

## 'నీవే మా దిక్కు'ని వేడుకునే విశ్వాసం



జీవితంలో ఎదురయ్యే కష్టాలు, పేదరికం, బాధ్యతల బరువు చాలా మందిని మానసికంగా అలసటకు గురిచేస్తాయి. అలాంటి సమయంలో రంజాన్ ప్రార్థనలు వారికి ఒక నూతన ఆశగా మారతాయి. 'నీవే మా దిక్కు.. మాకు బలం ఇవ్వు' అంటూ అల్లాను ప్రార్థించే వారి గళంలో ఒక నిరాశతో కూడిన ఆశ కనిపిస్తుంది. జీవితంలో ఎదురైన కష్టాలు, పేదరికం, బాధ్యతల బరువు.. ఈ అన్నింటి మధ్య మనిషి కొన్నిసార్లు ఒంటరిగా అనిపించుకుంటాడు. అలాంటి వేళల్లో మసీదు గడప అతనికి ఆశ్రయం అవుతుంది. 'నీవే మా దిక్కు.. మా తప్పులను క్షమించు' అని అల్లాకు విన్నవిస్తూ భక్తులు తమ మనసులోని భారాన్ని దింపుకుంటారు. ఆ ప్రార్థనల్లో విశ్వాసం, భయం, ప్రేమ.. అన్నీ కలిసిన ఒక ఆత్మీయత కనిపిస్తుంది!

## జీవితాన్ని 'రీ-స్టార్ట్' చేసుకునే ఆత్మశక్తి

రంజాన్ మాసం కేవలం 'ఉపవాసాని'కి మాత్రమే పరిమితం కాదు. అది ఆత్మపరిశీలనకు, మనసును శుభ్రం చేసుకునే సమయంగా కూడా భావిస్తారు. గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకుని కొత్తగా జీవితం మొదలుపెట్టాలని అనేక మంది నిర్ణయించుకుంటారు. చాలా మంది రంజాన్ నెలను తమ జీవితానికి 'కొత్త ఆరంభం'గా భావిస్తారు. గతంలో చేసిన పొరపాట్లను గుర్తుచేసుకుని వాటిని సరిదిద్దుకోవాలని సంకల్పిస్తారు. అల్లా క్షమాపణ పొందితే జీవితం మళ్లీ 'రీ-స్టార్ట్' అయినట్టేనని విశ్వసిస్తారు. అందుకే ప్రతి 'నమాజ్' తర్వాత చేతులు ఎత్తి, హృదయపూర్వకంగా ప్రార్థిస్తూ భవిష్యత్తులో మంచి మార్గంలో నడిచే శక్తిని ఇవ్వమని కోరుతారు. ప్రార్థనల అనంతరం వారి ముఖాల్లో కనిపించే ప్రశాంతత, ఆధ్యాత్మిక తృప్తి ఈ భావనను మరింత బలపరుస్తుంది.



# పశ్చాత్తాపం.. ప్రాయశ్చిత్తం



- రంజాన్ రాత్రుల్లో 'అల్లా'కు వినిపించేలా మనసుల మౌన నివేదన
- 'జిందగీ'లను 'రీ-స్టార్ట్' చేసుకుంటాం.. 'రీ-ఛార్జ్' చేయండని విన్నపం
- క్షమాపణ కోరే ప్రార్థనలు
- జీవితాన్ని మళ్లీ ప్రారంభించాలనే ఆశతో మసీదులలో భావోద్వేగ దృశ్యాలు

"పవిత్ర రంజాన్ మాసం కేవలం ఉపవాసాల కాలం మాత్రమే కాదు.. అది మనసును శుద్ధి చేసుకునే ఆధ్యాత్మిక యాత్ర.! మసీదులలో సాయంత్రం నుంచి రాత్రివేళల వరకు పురుషులు, మహిళలు, వృద్ధులు తమ జీవితపు బాధలు, తప్పులు, పశ్చాత్తాపాలను అల్లా ముందుంచి కన్నీళ్లతో ప్రార్థిస్తారు.! గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకునే మరో అవకాశం ఇవ్వమని వేడుకుంటూ, కొత్త ఆశతో జీవితాన్ని మళ్లీ ప్రారంభించాలనే సంకల్పంతో ఆరాధనలో మునిగిపోతారు"..


- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య )

## భారాన్ని మోసేందుకు 'శక్తి' కోసం విన్నపం..

కుటుంబ బాధ్యతలు, జీవన పోరాటం, అనేక సమస్యలతో నిండిన జీవితంలో ముందుకు సాగేందుకు మనోబలం అవసరం. అందుకే రంజాన్ ప్రార్థనల్లో భక్తులు అల్లాను వేడుకుంటారు.'మాకు శక్తిని ఇవ్వు... సరైన మార్గంలో నడిపించు... మా జీవితాన్ని సార్థకం చేయు..'మనే ప్రార్థనల్లో కేవలం పాపక్షమాపణ మాత్రమే కాదు, జీవన పోరాటాన్ని 'ఎదుర్కొనే శక్తి' కోసం కూడా విన్నపం ఉంటుంది. కుటుంబాన్ని పోషించాలి, పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలి, సమాజంలో సత్ప్రవర్తనతో జీవించాలి అనే బాధ్యతలు ప్రతి మనిషి భుజాలపై ఉంటాయి. ఆ బాధ్యతల బరువును మోసే ధైర్యం, శక్తి ఇవ్వమని అల్లాకు వేడుకుంటారు. ఈ ప్రార్థనలు కేవలం మాటలు కాదు.. మనసులోంచి పుట్టే నిజమైన 'భావోద్వేగాలు..'!







## కన్నీటిలో కొత్త ఆశ.. ఆధ్యాత్మిక 'రీ-ఛార్జ్'

మసీదు ప్రాంగణంలో కనిపించే ఆ 'కన్నీటి చుక్కలు' దుఃఖానికి సూచికలు మాత్రమే కాదు.. కొత్త ఆశకు సంకేతాలు కూడా.! పశ్చాత్తాపంతో కరిగిపోయే ఆ క్షణాల్లోనే మనసు తేలికపడుతుంది. ఈ ప్రార్థనల అనంతరం భక్తుల ముఖాల్లో కనిపించే ప్రశాంతత ప్రత్యేకమైనది. కన్నీళ్లతో భారమైన హృదయం క్రమంగా తేలికపడుతుంది. ఆ క్షణంలో వారు పొందేది కేవలం ఆధ్యాత్మిక సాంత్వన మాత్రమే కాదు, కొత్త ఆశ, కొత్త ధైర్యం కూడా. 'అల్లా కరుణ'పై విశ్వాసం ఉంచి, మరుసటి రోజు 'మంచి మనిషి'గా మారాలని ప్రతిజ్ఞ చేస్తూ విశ్వాసులు మసీదు నుంచి బయటకు వస్తారు. రంజాన్ మాసం చివరికి చేరేసరికి, మసీదులలో 'మౌనం'గా ఏడ్చిన ఆ మనసులు ఒక కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు 'రీ-ఛార్జ్' అయినట్టుగా బయటకు వస్తాయి.!

**ఇలా 'రంజాన్ మాసం' ప్రతి విశ్వాసికి ఒక 'ఆధ్యాత్మిక ప్రయాణం'గా మారుతుంది.! పాపక్షమాపణ కోసం ప్రార్థన, మనసు శుద్ధి కోసం ప్రయత్నం, జీవితాన్ని కొత్త ఆశతో మళ్లీ ప్రారంభించే సంకల్పం.!!**





# మహతి ఆడిటోరియమా! అరుంధతి భవనమా?




- కోట్ల రూపాయల భవనం మూసివేతలోనే
- రెండేళ్లుగా తలుపులు మూసే
- పాడవుతున్న ఫర్నిచర్, పరికరాలు ప్రైవేట్ కార్యక్రమాలకు అద్దెకిస్తే ఆదాయం వస్తుందంటున్న గజ్వేల్ ప్రజలు

**నేటి సాక్షి గజ్వేల్ :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధికి గతంలో భారీగా నిధులు కేటాయించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. నీళ్లు, నిధులు ఆంధ్ర ప్రాంతానికి వెళ్లాయని ఆరోపిస్తూ తెలంగాణ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం గజ్వేల్ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పలు మౌలిక వసతుల ప్రాజెక్టులు ప్రారంభించింది. ఈ క్రమంలోనే ఆధునిక సదుపాయాలతో కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన మహతి ఆడిటోరియం ప్రస్తుతం వినియోగంలో లేకపోవడం స్థానిక ప్రజల్లో అసంతృప్తి కలిగిస్తోంది. 2015లో ఈ ఆడిటోరియం నిర్మాణానికి శంకుస్థాపన చేసి, 2019లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ప్రారంభించిన తర్వాత కొన్నేళ్లు వివిధ సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించగా, గత రెండు సంవత్సరాలుగా మాత్రం ఆడిటోరియం తలుపులు తెరుచుకోకపోవడంతో మూసివేతలోనే ఉంది. దీంతో లోపల ఏర్పాటు చేసిన ఫర్నిచర్, ఎయిర్ కండిషనింగ్ పరికరాలు, విద్యుత్ సదుపాయాలు ఉపయోగం లేకపోవడంతో పాడవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఈ ఆడిటోరియాన్ని వివాహాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలకు అద్దెకు ఇచ్చి కొంతమేర ఆదాయం కూడా పొందేవారని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఆ విధానం నిలిచిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. గజ్వేల్ పట్టణ అభివృద్ధి కోసం సమీకృత ప్రభుత్వ కార్యాలయ భవనం, సమీకృత కూరగాయల మార్కెట్, పట్టణం చుట్టూ సుమారు 23 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, చెరువుల సుందరీకరణ, నూతన మున్సిపల్ కార్యాలయం, సంగాపూర్ వద్ద హెర్బల్ పార్క్ వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో కొన్నింటి ద్వారా ప్రజలకు ఉపయోగం కలుగుతున్నప్పటికీ, మహతి ఆడిటోరియం మాత్రం ప్రస్తుతం నిరుపయోగంగా మారిందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి ఈ ఆడిటోరియాన్ని తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గజ్వేల్ ప్రజలు కోరుతున్నారు. ప్రైవేట్ కార్యక్రమాలకు అద్దెకు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం కూడా లభిస్తుందని వారు సూచిస్తున్నారు. లేకపోతే కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ భవనం కూడా గతంలో నిర్మించిన కొన్ని భవనాల మాదిరిగా నిరుపయోగంగా మారే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# హాజీపురాలో సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణం



- చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు
- కిసాన్ మాల్ కింగ్స్ గార్డెన్ వీధిలో భవన నిర్మాణంపై స్థానికుల ఆందోళన
- రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని నివాసుల ఆవేదన

**నేటి సాక్షి, కోరుట్ల(రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని హాజీపురా 15వ వార్డు పరిధిలో మునిసిపల్ నిబంధనలకు విరుద్ధంగా సెట్‌బ్యాక్ లేకుండా భవన నిర్మాణం జరుగుతోందని స్థానిక నివాసులు ఆరోపిస్తూ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. హాజీపురా ప్రాంతంలోని కిసాన్ మాల్ కింగ్స్ గార్డెన్ వీధిలో ఒక కొత్త భవన నిర్మాణం చేపడుతున్నారని, అయితే ఈ నిర్మాణం రోడ్డుకు అవసరమైన సెట్‌బ్యాక్ లేకుండా జరుగుతోందని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తూ మునిసిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా వినతి పత్రం అందజేశారు. సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం కొనసాగితే రహదారి విస్తీర్ణం తగ్గిపోయి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగే అవకాశముందని నివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అత్యవసర వాహనాలు వెళ్లేందుకు కూడా సమస్యలు తలెత్తే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ నిర్మాణాన్ని అధికారులు వెంటనే పరిశీలించి, మునిసిపల్ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ప్రజల భద్రతతోపాటు రహదారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హాజీపురా నివాసి మిర్జా ముక్రం బైగ్ ఆధ్వర్యంలో స్థానికులు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు.

# ముదిరాజులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ముత్యంపేట ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సబ్బని శ్రీనివాస్
- వృద్ధాప్య పింఛన్లు, ఉపాధి అవకాశాలు కల్పించాలి
- యువతకు విద్యా, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అవసరం

**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** సమాజంలో ము దిరాజులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం ముందుకు రావాలని ముత్యంపేట ము దిరాజ్ సంఘం అధ్యక్షుడు సబ్బని శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముదిరాజ్ సమాజం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ముదిరాజులు స్వావలంబిగా జీవించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా వృద్ధాప్య పింఛన్లు, ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు, స్వయం సహాయ కార్యక్రమాలు కల్పించాలని సూచించారు. ఆరోగ్య రక్షణ, వైద్య సౌకర్యాల మెరుగుపరచాలని తెలిపారు. ముదిరాజ్ యువతకు విద్యా, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు పెంచితే వారి భవిష్యత్తు బలపడుతుందని ఆయన పేర్కొ న్నారు. ప్రభుత్వ పథకాలు సమర్థంగా అమలైతే సమాజంలో వారి స్థాయి మరింత మెరుగుపడుతుందని అన్నారు. ముదిరాజులు అనుభవజ్ఞులు, సమాజానికి మార్గదర్శకులు. వారికి గౌరవం, అవసరమైన సహాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని సబ్బని శ్రీనివాస్ అన్నారు. సమాజంలోని ప్రతి వ్యక్తి, సంఘాలు కలిసి ముదిరాజుల అభివృద్ధికి తోడ్పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



**నేటి సాక్షి, సిరిసిల్ల(శివకుమార్):** నెహ్రూ నగర్ ఏరియాలో ఐద్వా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు . నిరంతరం మహిళా హక్కుల కొరకు పోరాడుతున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం లో మహిళలందరూ సభ్యులుగా చేరి సంఘం బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఈరోజు దేశంలో మహిళలకు భద్రత లేకుండా పోతుంది ఇంటి నుండి బయటకు వెళ్ళితే మళ్ళీ ఇంటికి చేరుకునే దాకా ఇప్పుడు ఏం జరుగుతుంది ప్రతి మహిళ భయపడుతూ జీవిస్తున్న పరిస్థితి కొనసాగుతుంది స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న కూడా మహిళలు ఒంటరిగా స్వతంత్రంగా తిరిగే పరిస్థితి రాలేదు మహిళల రక్షణ కోసం తీసుకువచ్చిన నిర్భయ చట్టం లైంగిక వేధింపుల చట్టం వరకట్నం వేధింపుల చట్టం గృహహింస చట్టం ఇవి ఏమి మహిళలకు రక్షణ కల్పిస్తా లేవు దేశంలో అధికారిక గణింకాల లెక్కల ప్రకారంరోజుకు గంటకు ఇద్దరు మహిళలు లైంగిక దాడులకు గురవుతున్నారు ప్రతి 26 నిమిషాలకు ఒక మహిళ వేధింపులకు గురవుతుంది ప్రతి 34 నిమిషాలకు ఒక మహిళ అత్యాచారానికి గురవుతుంది పని ప్రదేశాల్లో భద్రత లేదు సమాన పనికి సమాన వేతనం అమలు కాదు అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందుతున్న పురుషులతోటి పోటీపడి సమానంగా పనిచేస్తున్న కూడా మనువాద భావాజాలం వలన అణిచివేయాలని చూస్తున్నారు మహిళను మనిషిగా చూసే సమాజం రావాలని అప్పుడే మహిళకు తగిన గౌరవం లభిస్తుంది . అన్నారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి జవ్వాజి విమల సూరం పద్మ . ఆడెపు రజిత గడప మాధవి నేల పెల్లి శ్యామల గురజాల మమత మల్లారపు నరసవ

## వార్షికోత్సవల్లో మాజీ ఎమ్మెల్యే



**నేటి సాక్షి - కోరుట్ల, (రాధారపు నర్సయ్య ):** కోరుట్ల పట్టణంలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయం..శ్రీ సంతోషిమాత దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో కోరుట్ల మాజీ ఎమ్మెల్యే,జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పాల్గొన్నారు.!

## అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన బీజేపీ కౌన్సిలర్లు



**నేటి సాక్షి - కోరుట్ల,(రాధారపు నర్సయ్య):** కోరుట్ల మున్సిపాలిటీలో నిర్వహించిన తొలి కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యే ముందు బీజేపీ కౌన్సిలర్లు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోరుట్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా బీజేపీకి చెందిన కౌన్సిలర్లు ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ అనంతరం కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు సోరూపాక రమాదేవి-రమేష్,ఇందూరి తిరుమల వాసు, కస్తూరి లక్ష్మీనారాయణ, కలల రాధా-సాయిచంద్,గుగ్లావత్ శ్రీకాంత్ పాల్గొన్నారు. అనంతరం వారు కోరుట్ల మున్సిపల్ తొలి కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు.

## టిసిజిఓ జగిత్యాల జిల్లా డైరీ-2026 ఆవిష్కరణ




**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,(రాధారపు నర్సయ్య):** తెలంగాణ కోఆపరేటివ్ గ్రూప్ ఆర్గనైజేషన్ (టిసిజిఓ) జగిత్యాల జిల్లా డైరీ-2026ను జిల్లా సహకార అధికారి సి. హెచ్. మనోజ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ డైరీ సహకార సంఘాలు, సభ్యులు మరియు స్థానిక సమాజానికి ఉపయోగకరమైన సమాచారం, ప్రణాళికలు అందించేలా రూపొందించబడింది. ఆవిష్కరణ సందర్భంగా అధికారులు సహకార రంగంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ అధికారి యం. సత్యనారాయణ, టిసీజిఓ జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఏ. మల్లేశం, సంఘ సభ్యులు, సహకార శాఖ సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

## అయిలాపూర్‌లో అయ్యప్ప గుడి నిర్మాణానికి భూమిపూజ



**నేటి సాక్షి - కోరుట్లలి ( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించబోయే అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యా సాగర్ రావు ,ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ



**నేటి సాక్షి సీరీసిల్ల (శివకుమార్):** సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని కుసుమరామయ్య ఉన్నత పాఠశాల, నెహ్రూ నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాలను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు



# పెళ్లికొడుకు అయిన టీమిండియా స్టార్ క్రికెటర్

## భార్య ఆస్తి ఎంతో తెలుసా?

భారత క్రికెట్ జట్టు స్టార్ చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తన జీవితంలో కొత్త ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తున్నారు. తన చిన్ననాటి స్నేహితురాలు వంశిక చద్దాను ఆయన నేడు (మార్చి 14, 2026) వివాహం చేసుకోబోతున్నారు. ముస్సోరీలో అత్యంత సన్నిహితుల మధ్య ఈ వివాహ వేడుక వైభవంగా జరుగుతోంది. కుల్దీప్, వంశికలది కాన్పూర్‌లో మొదలైన అందమైన ప్రేమకథ అని వారి సన్నిహితులు చెబుతున్నారు. పొరుగు ఇళ్లలో పెరిగిన వీరిద్దరి మధ్య ఉన్న చిన్ననాటి స్నేహం కాలక్రమేణా ప్రేమగా మారింది. 2025లో ఈ జంట తమ నిశ్చితార్థాన్ని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. నిజానికి గతేడాదే పెళ్లి జరగాల్సి ఉన్నా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడి ఈరోజు శుభముహూర్తం ఖరారైంది.

వంశిక చద్దా నేపథ్యం ఇదే.. లైమ్‌లైట్‌కు దూరంగా ఉండటానికి ఇష్టపడే వంశిక చద్దా వృత్తిరీత్యా కార్పొరేట్ ఉద్యోగి. ఆస్ట్రేలియాలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన ఈమె ప్రస్తుతం ఎల్ఐసీ సంస్థలో పని చేస్తున్నారు. ఆమె తండ్రి యోగేష్ చద్దా కూడా అదే సంస్థలో పని చేయడం విశేషం. నిరాడంబరమైన మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వంశిక, తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో కుల్దీప్ యాదవ్ -- వంశికల ఆస్తుల గురించి ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. పలు నివేదికల ప్రకారం వారి ఆస్తుల వివరాలు ఇలా ఉన్నాయి.. టీమిండియా మ్యాచ్ ఫీజులు, ఐపీఎల్ (ఢిల్లీ క్యాపిటల్స్) కాంట్రాక్టులు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌ల ద్వారా కుల్దీప్ దాదాపు రూ.34 కోట్ల నికర విలువను కలిగి ఉన్నారు. ఇకపోతే వంశిక చద్దా ఆస్తుల విషయానికి వస్తే.. తన కార్పొరేట్ ఉద్యోగం ద్వారా వంశిక సుమారు రూ.40 -- 50 లక్షల వరకు ఆస్తిని కలిగి ఉన్నట్లు సమాచారం. ఆర్థికంగా కుల్దీప్ చాలా ముందంజలో ఉన్నప్పటికీ, వీరిద్దరి మధ్య ఉన్న బంధం ఆస్తులకు అతీతమని వారి సన్నిహితులు చెబుతుంటారు.

### రాయల్ వెడ్డింగ్ కార్డ్.. లక్నోలో రిసెప్షన్

ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రిక ఇప్పటికే నెట్టింట వైరల్ అయ్యింది. 'కేవీ' (కుల్దీప్-వంశిక) అనే ఇనీషియల్స్‌తో కూడిన 3డీ మెటాలిక్ బాక్స్ వెడ్డింగ్ కార్డ్ అందరినీ ఆకట్టుకుంటోంది. ముస్సోరీలో ప్రైవేట్ వేడుకగా వివాహం ముగిసిన తర్వాత, లక్నోలో ఘనంగా వెడ్డింగ్ రిసెప్షన్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి క్రికెట్ దిగ్గజాలతో పాటు పలువురు సెలబ్రిటీలు హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం.

# అభిషేక్ శర్మ ఓ 'రాస్కల్'

## ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ ఆసక్తికర వ్యాఖ్యలు..!

ముగిసిన ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా డ్యాషింగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ తన ఫామ్‌పై పలు విమర్శలు ఎదుర్కొన్నాడు. ఫైనల్ కు ముందు జరిగిన ఏడు మ్యాచ్ లలో అతను కేవలం 89 పరుగులే చేశాడు. ఇందులో గ్రూప్ దశలో వరుసగా మూడు సార్లు డక్ గా అవుట్ అయ్యి.. అవసరంలేని రికార్డ్ ను మూటగట్టుకున్నాడు. అయితే ఫైనల్ మ్యాచ్ లో మాత్రం అభిషేక్ శర్మ తన నుండి రావాల్సిన ధనాధన్ ఇన్నింగ్స్ ను ఆడేసాడు. ఈ నేపథ్యంలో కేవలం 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించి జట్టుకు భారీ స్కోరు అందించడంతో పాటు టోర్నీలో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీని నమోదు చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మాజీ వికెట్ కీపర్, వైస్ కెప్టెన్ బ్రాడ్ హాడిన్ అభిషేక్ శర్మపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పెద్ద మ్యాచ్ ల్లో అభిషేక్ అద్భుతంగా ఆడతాడని, సరదాగా అతన్ని "రాస్కల్" అని కూడా వ్యాఖ్యానించాడు. ఇంకా నాకు అభిషేక్ శర్మ అంటే చాలా ఇష్టమన్నారు. టోర్నీలో అతని స్థానంపై చాలా చర్చ జరిగింది. గ్రూప్ మ్యాచ్ ల్లో వరుసగా కొన్ని డ క్‌లు రావడంతో అతను ఒత్తిడిలో ఉన్నాడని అనిపించింది. కానీ, పెద్ద మ్యాచ్ ల్లో ఇలాంటి ఆటగాళ్లే అవసరమని.. వారు ఒత్తిడిని ఎదుర్కొని ప్రత్యర్థిపై ఒత్తిడి పెడతారని ఆయన తన భావనని వ్యక్త పరిచారు. ఫైనల్‌లో అతను ఆడిన తీరు మ్యాచ్ ను భారత్ వైపు తిప్పిందని హాడిన్ ఓ క్రికెట్ పోడ్ కాస్ట్ లో అన్నారు. అలాగే హాడిన్ న్యూజిలాండ్ జట్టును కూడా ప్రశంసించాడు. ఫైనల్‌కు చేరుకోవడం గొప్ప విషయమని అంటూనే.. కీలక సమయంలో మాత్రం వారు తడబడతారని పేర్కొన్నాడు. న్యూజిలాండ్ మరోసారి ఫైనల్‌కు చేరుకోవడం మంచి విషయం. ఫిన్ అలెన్, టిమ్ సెఫర్ట్ అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. టోర్నీలో ప్రతిదీ వారి వైపే ఉందనిపించింది. కానీ చివరి అడ్డంకిని దాటలేకపోయారని.. చివరికి మెరుగైన జట్టే గెలిచిందంటూ బ్రాడ్ హాడిన్ అన్నారు.








# మైదానంలో 'రనౌట్' రచ్చ

నిన్నటి వరకు మైదానం వెలుపల మిత్రులుగా ఉన్న బంగ్లాదేశ్, పాకిస్తాన్ క్రికెటర్ల మధ్య ఒక్క 'రనౌట్' తీవ్ర ఉత్కంఠకు, వివాదానికి దారితీసింది. శుక్రవారం జరిగిన రెండో వన్డేలో పాక్ బ్యాటర్ సల్మాన్ అలీ ఆఘా అవుట్ అయిన తీరు ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ఇరు దేశాల ఆటగాళ్లు, మాజీల మధ్య సోషల్ మీడియా వేదికగా మాటల యుద్ధం నడుస్తోంది.

- బంగ్లా, పాక్ క్రికెటర్ల మధ్య మాటల యుద్ధం!
- నిబంధనలకే మా ప్రాధాన్యం అన్న లిటన్ దాస్
- క్రీడా స్ఫూర్తి ఎక్కడంటూ పాక్ మాజీల ధ్వజం

**ఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్ సమయంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు ఒకరికొకరు మద్దతు ఇచ్చుకున్నాయి. బంగ్లాదేశ్ టోర్నీ నుంచి బయటకు వెళ్లడానికి పాక్ క్రికెట్ బోర్డు కూడా ఒక కారణం. కానీ ఇప్పుడు బంగ్లాదేశ్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న సిరీస్ ఒక్క "రనౌట్" కారణంగా తీవ్ర వివాదంగా మారింది. పాకిస్తాన్-బంగ్లాదేశ్ మధ్య జరిగిన రెండో వన్డేలో సల్మాన్ అలీ అఘా రనౌట్ కావడం వివాదానికి దారితీసింది. బంగ్లాదేశ్ కెప్టెన్ లిటన్ దాస్ రనౌట్ పూర్తిగా నిబంధనల పరిధిలో ఉందని,ఆట స్ఫూర్తిని ఉల్లంఘించలేదని పేర్కొన్నారు. సల్మాన్ అలీ ఆఘా, రమీజ్ రాజా వంటి వారు దీనిని క్రీడా స్ఫూర్తిని ఉల్లంఘించడమేనని విమర్శించారు. మార్చి 13వ తేదీ శుక్రవారం జరిగిన రెండో వన్డేలో రనౌట్ విషయంలో వివాదం చెలరేగింది. ఈ సంఘటనపై బంగ్లాదేశ్, పాకిస్తాన్ క్రికెటర్ల మధ్య మాటల యుద్ధం జరిగింది. పాకిస్తాన్ బ్యాటర్లు సల్మాన్ అఘా, మహ్మద్ రిజ్వాన్ బలమైన భాగస్వామ్యాన్ని నిర్మిస్తుండగా 39వ ఓవర్‌లో ఈ సంఘటన జరిగింది . బంగ్లాదేశ్ కెప్టెన్ మెహిదీ హసన్ మీరాజ్ బౌలింగ్ చేస్తున్నాడు. ఆ సమయంలో రిజ్వాన్ బాల్‌ను మెల్లిగా కొట్టగా అది నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న మిరాజ్ వైపు వెళ్లింది. ఆ సమయంలో క్రీజ్ బయట ఉన్న సల్మాన్ అలీ ఆఘా మిరాజ్‌కు బాల్ ఇచ్చే ప్రయత్నం చేశాడు. ఆ లోపే మిరాజ్ బాల్ తీసుకుని, వికెట్ల వైపు విసిరాడు. బెయిల్స్ లేచే సమయంలో ఆఘా క్రీజ్ బయట ఉన్నాడు. దీంతో ఎంపైర్ అతడిని ఔట్‌గా ప్రకటించారు. ఈ ఘటనపై ఆఘా, మిరాజ్‌తో వాగ్వాదానికి దిగాడు. లిట్టన్ దాస్ జోక్యం చేసుకోవడం పరిస్థితి కొంతవరకు దిగజారింది, కానీ రిజ్వాన్ జోక్యం చేసుకుని పరిస్థితిని శాంతింపజేశాడు. అయితే, మ్యాచ్ తర్వాత కూడా ఉద్రిక్తత కొనసాగింది, ఇరువర్గాలు ప్రకటనలు మార్చుకున్నాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో కూడా వైరల్ అయింది. మ్యాచ్ తర్వాత లిటన్ దాస్ మాట్లాడుతూ.. ఇది ఛారిటీ మ్యాచ్ కాదని, ఇది అంతర్జాతీయ మ్యాచ్ అని, నిబంధనల ప్రకారం అవుట్ అయితే, అది క్రీడాస్ఫూర్తికి విరుద్ధం కాదని స్పష్టం చేశారు. ఈ సంఘటనపై వ్యాఖ్యానిస్తూ, రమీజ్ రాజా మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం ఇది ఖచ్చితంగా అవుట్ అయినప్పటికీ, బ్యాట్స్‌మన్ బౌలర్‌కు సహాయం చేయడానికి ప్రయత్నించడం వల్ల ఆట స్ఫూర్తి దెబ్బతింటుందని అన్నారు. అయితే, లిటన్ దాస్ ఈ అభిప్రాయంతో విభేదించాడు. ప్రతి ఒక్కరూ తమ సొంత అభిప్రాయాన్ని కలిగి ఉండవచ్చు, కానీ ఆటగాళ్లకు అవుట్ అంటే అవుట్ అని ఆయన అన్నారు. మ్యాచ్ తర్వాత జరిగిన విలేకరుల సమావేశంలో సల్మాన్ అలీ ఆఘా మాట్లాడుతూ, మిరాజ్ స్థానంలో తాను ఉండి ఉంటే బహుశా అలాంటి పని చేసి ఉండేవాడని అన్నారు. ఆటలో క్రీడా స్ఫూర్తి ఒక అంశంగా ఉండాలని ఆయన నమ్ముతున్నారు. ఈ వివాదం ఉన్నప్పటికీ, పాకిస్తాన్ మ్యాచ్‌లో అద్భుతంగా రాణించి డక్‌వర్త్ లూయిస్-స్టెర్న్ నియమం ప్రకారం బంగ్లాదేశ్‌ను 128 పరుగుల తేడాతో ఓడించింది.

# లెజెండ్స్‌కు బీసీసీఐ సలాం!

## రాహుల్ ద్రవిడ్, రోజర్ బిన్నీ, మిథాలీ రాజ్‌లకు అత్యున్నత పురస్కారాలు

**ఢిల్లీ:** భారత క్రికెట్ చరిత్రలో తమదైన ముద్ర వేసిన దిగ్గజాలకు బీసీసీఐ అత్యున్నత పురస్కారాలను ప్రకటించింది. టీమిండియా మాజీ కెప్టెన్, మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్, మాజీ ఫాస్ట్ బౌలర్, మాజీ బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీలను ఈ ఏడాది ప్రతిష్టాత్మక కల్నల్ సి.కె.నాయుడు జీవిత సాఫల్య పురస్కారం వరించింది. అలాగే మహిళా క్రికెట్ దిగ్గజం మిథాలీ రాజ్ కు బీసీసీఐ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేయనున్నారు.

### దిగ్గజాల ప్రస్థానం ఇదే..

**రాహుల్ ద్రవిడ్:** అంతర్జాతీయ క్రికెట్‌లో 24,000 పరుగులు చేసిన ద్రవిడ్, భారత బ్యాటింగ్ వెన్నెముకగా నిలిచారు. కోచ్‌గా అండర్-19 ప్రపంచ కప్ (2018), సీనియర్ పురుషుల జట్టుకు ౨20 ప్రపంచ కప్ (2024) అందించడంలో ఆయన పాత్ర చిరస్మరణీయం.

**రోజర్ బిన్నీ:** 1983 ప్రపంచ కప్ హీరోలలో ఒకరైన బిన్నీ, ఆ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసి రికార్డు సృష్టించారు. 2022-25 వరకు బీసీసీఐ అధ్యక్షుడిగా కూడా సేవలందించారు.


**మిథాలీ రాజ్:** మహిళా క్రికెట్‌లో 10,868 పరుగులు చేసిన మిథాలీ, భారతదేశంలో మహిళా క్రీడకు కొత్త దిశను చూపించారు.

### స్టార్ ఆఫ్ ది ఇయర్ గా శుభ్‌మాన్ గిల్

2024-25 సీజన్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన శుభ్‌మాన్ గిల్ ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్ (పురుషుల విభాగం)గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు పాలీ ఉమ్రిగర్ ట్రోఫీని ప్రదానం చేయనున్నారు. మహిళల విభాగంలో స్మృతి మంధాన ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్‌గా అవార్డు అందుకోనున్నారు.

డొమెస్టిక్ క్రికెట్‌లో ముంబై హవాదేశీయ టోర్నమెంట్లలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు గాను ముంబై క్రికెట్ అసోసియేషన్‌కు అవార్డు లభించింది. అలాగే వివిధ విభాగాలలో (కూచ్ బెహార్, విజయ్ మర్చంట్ ట్రోఫీ) రాణించిన యువ క్రీడాకారులకు జగ్మోహన్ దాల్మియా, ఎం.ఏ చిదంబరం ట్రోఫీలను అందజేయనున్నారు. ఈ వేడుకలో ఇటీవల ఐసీసీ ట్రోఫీలు గెలిచిన భారత జట్లను కూడా సత్కరించనున్నారు. అయితే ఈసారి విజేతల జాబితాలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ పేర్లు లేకపోవడం గమనార్హం.



### అవార్డుల జాబితా ..

**ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్ (పురుషులు) :** శుభ్‌మాన్ గిల్
**ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్ (మహిళలు) :** స్మృతి మంధాన
**ఉత్తమ అంతర్జాతీయ అరంగేట్రం (పురుషులు) :** హర్షిత్ రాణా
**ఉత్తమ అంతర్జాతీయ అరంగేట్రం (మహిళలు) :** శ్రీ చరణిరంజీ
**రంజీ ట్రోఫీలో ఉత్తమ ఆల్ రౌండర్ :** హర్ దుబే
**పరిమిత ఓవర్లలో ఉత్తమ ఆల్ రౌండర్ :** ఆయుష్ మాత్రే
**రంజీ ట్రోఫీలో అత్యధిక పరుగులు (ఎలైట్) :** యష్ రాథో
**ర్రంజీ ట్రోఫీలో అత్యధిక వికెట్లు (ఎలైట్) :** హర్ష్ దుబే
**ఉత్తమ అంపైర్ :** ఉల్హాస్ గాంధే




TGTEL/25/A1737 | NETI SAKSHI



# రాజ్ కుమార్ రావుతో కీర్తి సురేష్ జోడీ

## ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వంలో రఫ్తార్

బాలీవుడ్ విలక్షణ నటుడు రాజ్ కుమార్ రావు మరియు సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ తొలిసారిగా జతకట్టబోతున్నారు. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'రఫ్తార్'. ఇంటెన్స్ థ్రిల్లర్ డ్రామాగా రాబోతున్న ఈ ప్రాజెక్టును రాజ్ కుమార్ రావు భార్య, నటి పత్రలేఖ తన సొంత నిర్మాణ సంస్థ 'కాంపా ఫిల్మ్స్'పై అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పణలో నిర్మించబోతుంది. విద్యా వ్యవస్థలోని చీకటి కోణాలు, కార్పొరేట్ పోటీ, సక్సెస్ కోసం ఆరాటపడే ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా సాగనుంది. ముఖ్యంగా డబ్బు, అధికారం మనుషుల సంబంధాలను ఎలా మారుస్తాయనే అంశాన్ని దర్శకుడు ఆదిత్య నింబాల్కర్ ఈ థ్రిల్లర్‌లో చూపించబోతున్నారు. ఇక నేషనల్ అవార్డు గ్రహీతలైన రాజ్ కుమార్ రావు, కీర్తి సురేష్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరితో పాటు అనూరాగ్ ఠాకూర్, తాన్యా మణిక్తలా మరియు రజత్ కపూర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో 'సెక్టార్ 36'తో మెప్పించిన ఆదిత్య నింబాల్కర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో కథనం చాలా ఉత్కంఠభరితంగా ఉంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ భారీ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.



# తమన్నా బుగ్గపై అభిమాని ముద్దు

ఈ మధ్య పబ్లిక్ ప్లేస్‌లలో, ఈవెంట్స్‌లలో, పలు వేదికలపై సెలబ్రిటీలకు ఎదురయ్యే చేదు అనుభవాలను సోషల్ మీడియాలో చూస్తునే ఉంటాం. ముఖ్యంగా సినీ సెలబ్రిటీలు బయట కనిపిస్తే చాలు.. సెల్ఫీ కోసం అభిమానులు ఎగబడుతుంటారు. సదరు తారలు సైతం ఈ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు. కానీ, తాజాగా తమన్నా చేసిన పనికి మాత్రం ఫిదా అవాల్సిందే. ఆమెను ఓ అభిమాని ముద్దు పెట్టుకోవడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే, ప్రస్తుతం ఇక్కడ అభిమాని అంటే లేడీ ఫ్యాన్ మాత్రమే.

లేటెస్ట్‌గా ఓ కల్చరల్ ఈవెంట్‌కు తమన్నా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో.. స్టేజ్ మీద తమన్నా తన గ్లామర్‌తో, డ్యాన్స్‌తో స్టూడెంట్స్‌ను ఉర్రూతలూగించారు. ఈ క్రమంలోనే ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. స్టేజ్ మీద తనతో పాటే ఉన్న ఓ లేడీ అభిమాని తమన్నాపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ ఆమె బుగ్గపై ముద్దు పెట్టుకున్నారు. సాధారణంగా ఇలాంటి సమయంలో సెలబ్రిటీలు కాస్త ఇబ్బందిగా ఫీలవుతారు. కానీ తమన్నా మాత్రం ఏమాత్రం తడుముకోకుండా, చిరునవ్వుతో ఆ ఫ్యాన్‌ను హగ్ చేసుకుని తిరిగి ఆమె బుగ్గపై ముద్దు పెట్టారు. సెల్ఫీ అడిగితేనే విసుక్కునే ఈ రోజుల్లో.. అభిమాని ఇచ్చిన ముద్దుకు అంతే ప్రేమతో బదులివ్వడం చూసి అక్కడి వారంతా షాక్ అయ్యారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఈ వీడియో చూసిన నెటిజన్లు.. తమన్నా నిజంగా గోల్డెన్ హార్ట్ ఉన్న వ్యక్తి అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం తమన్నా చేతిలో పలు క్రేజీ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. ఒకవైపు గ్లామర్ రోల్స్ చేస్తూనే, మరోవైపు పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రలతో దూసుకుపోతున్నారు.



# దురంధర్.. సూపర్బ్

## అందుకేనేమో ఆదిత్యధర్‌పై అందరికీ అసూయ

## రామ్‌గోపాల్ వర్మ సంచలన కామెంట్స్



సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తన కామెంట్స్‌తో హాట్ టాపిక్‌గా మారారు. బాలీవుడ్ దర్శకుడు ఆదిత్య ధర్ ప్రతిభను ప్రశంసిస్తూనే, ఆయనపై ఇండస్ట్రీ అసూయ చూపిస్తుందంటూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల ఆదిత్య ధర్ తెరకెక్కించిన 'ధురంధర్' సినిమా చూసిన తర్వాత తనకు ఆయనపై భారీ అభిమానం పెరిగిందని రామ్ గోపాల్ వర్మ తెలిపారు. ఆ చిత్రంలోని మేకింగ్, టేకింగ్ తనను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నారు. ఆదిత్య ధర్ తన ప్రత్యేక శైలితో సినిమా మేకింగ్‌ను పూర్తిగా కొత్త దిశలోకి తీసుకెళ్లారని వర్మ ప్రశంసించారు. అయితే ఇదే సమయంలో పరిశ్రమలో ఆయనపై అసూయ కూడా పెరుగుతోందని వర్మ వ్యాఖ్యానించారు. ఆదిత్య ధర్ తీసుకొచ్చిన కొత్త తరహా మేకింగ్ వల్ల పలు భారీ యాక్షన్ చిత్రాల టీమ్‌లు తమ సినిమాల షూటింగ్‌లను ఆపేసి రీ-షూటింగ్ చేయాల్సి వస్తోందని చెప్పారు. దీంతో కొందరు నిర్మాతలు నష్టపోతున్నారని, అందుకే ఆదిత్య ధర్ ,ఆయన భార్య యామీ గౌతమ్ పతనం కోసం కొందరు వేచి చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి. రామ్ గోపాల్ వర్మ చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో కూడా విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి.



# మరోమారు అనుష్క పెళ్లి వార్తలు

పెళ్లి పీటలు ఎక్కనుందంటూ సోషల్ మీడియాలో హల్‌చల్

దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు 'లేడీ సూపర్ స్టార్'గా వెలుగొందిన అనుష్క శెట్టి వివాహ వార్తలు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. గత కొన్నేళ్లుగా ఆమె పెళ్లిపై అనేక ఊహాగానాలు వచ్చినప్పటికీ, ఈసారి మాత్రం ఆమె త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. 44 ఏళ్ల అనుష్క ఈ ఏడాది పెళ్లి పీటలు ఎక్కేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వరుడు ఆమె కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన బెంగళూరుకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్త అని, ఇది పూర్తిగా పెద్దలు కుదిర్చిన సంబంధమని సమాచారం. ఇప్పటికే ఇరు కుటుంబాల మధ్య చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. చాలా కాలంగా అనుష్క పేరు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో కలిపి వినిపిస్తున్నప్పటికీ, వారిద్దరూ కేవలం ప్రాణ స్నేహితులమని పలుమార్లు స్పష్టం చేశారు. తాజా పరిణామాలతో ఈ రూమర్లకు చెక్ పడే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు, అనుష్క గత చిత్రం 'ఘాటి' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె కేవలం మలయాళ చిత్రం 'కథనార్' షూటింగ్‌లో మాత్రమే పాల్గొంటున్నారు. ఈ సినిమా పనులు పూర్తయిన వెంటనే ఆమె వివాహం చేసుకునే ఛాన్స్ ఉందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**



# ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

## కాంగ్రెస్ నారాయణపేట జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి

**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని తీలేరు గ్రామంలో రవి గౌడ్ రాధిక దంపతుల ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలి ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఇంటి కార్యక్రమానికి నారాయణపేట జిల్లా డిసిసి అధ్యక్షుడు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డిగారు ముఖ్య అతిథులుగా విచ్చేసి రిబ్బన్ కటింగ్ చేసి మరియు రవి గౌడ్ రాధిక, దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సూర్య మోహన్ , మరికల్ మండల అధ్యక్షులు వీరన్న , మరికల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు , రామకృష్ణ, రామకృష్ణ రెడ్డి , మరికల్ వార్డ్ సభ్యుడు అశోక్ , మాజీ ఉప సర్పంచ్ భద్రప్ప, చంద్రాములు , కురుమ అన్న , రాములు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# బోరు-మోటార్'ను ప్రారంభించిన కౌన్సిలర్ శిరీష నవీన్



**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** మెట్‌పల్లి పట్టణంలోని బంటుపేట మాల సంఘ భవనంలో నూతన బోరు మోటార్ ను 14వ వార్డు కౌన్సిలర్ ధోనికెల శిరీష నవీన్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మాల సంఘ భవనంలో పాత బోర్ మోటర్ చెడిపోవడంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కౌన్సిలర్ ధోనికెల శిరీష నవీన్ నూతన మోటార్ ఏర్పాటు చేయగా శనివారం దానిని ప్రారంభించారు. అనంతరం బంటుపేట మాల సంఘ సభ్యులు, మహిళలు కౌన్సిలర్ దంపతులను సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బిట్లుగు కార్తీక్, కారం నరేష్, గుమ్మడి విక్రమ్, కంబ అశోక్,కంబ నాగరాజు, బొలుమల్ల సుమన్, కారం కిషోర్,బొల్లుమల కిరణ్ రాజేందర్, మహిళా సంఘ సభ్యులు దొంగేరి విజయ, పొట్ట లలిత, కారం రజినీ, లక్ష్మీ, రాసమొల్ల రాజమణి, బోల్ల మల్ల దివ్య , కారం అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# కేవిన్స్ బాదం పాలలో వింత ఆకారం

## జంతు చర్మంలాంటి పదార్థం చూసి షాక్ తిన్న వినియోగదారుడు

**నేటి సాక్షి, సిరిసిల్ల(శివకుమార్):** ప్రముఖ పాల ఉత్పత్తుల కంపెనీ 'కేవిన్స్' (Cavin's) బ్రాండ్‌కు చెందిన బాదం పాలు ఇప్పుడు పెద్ద చర్చకు దారితీశాయి. ఒక వినియోగదారుడు కొనుగోలు చేసిన బాదం పాల బాటిల్‌లో పాలతో పాటు ఒక వింతైన, గట్టి పదార్థం కనిపించడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. కేవిన్స్ బాదం పాల బాటిల్‌ను తెరవగా, లోపల నుండి ముద్దగా ఉన్న ఒక పదార్థం బయటకు వచ్చింది. అది పాలు విరిగిపోయి ఏర్పడిన గడ్డలా కాకుండా, చూడటానికి జంతువు చర్మం లేదా ఏదో ప్లాస్టిక్ పొర లాగా కనిపిస్తుండటం కలకలం రేపుతోంది. బాటిల్‌ను కట్ చేసి చూసినప్పుడు, లోపల పసుపు రంగులో గట్టిగా, సాగుతున్నట్లున్న పదార్థం బయటపడింది. బాటిల్‌పై ఉన్న వివరాల ప్రకారం అది ఇంకా ఎక్స్‌పైర్ కాలేదు (Best Before 01/08/2026). అయినా ఇలాంటి పదార్థం రావడం కంపెనీ నాణ్యతా ప్రమాణాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. చిన్న పిల్లల నుండి పెద్దల వరకు ఎంతో ఇష్టంగా తాగే ఇలాంటి పానీయాల్లో ఇలాంటి కల్తీ లేదా అపరిశుభ్ర పదార్థాలు రావడం పట్ల జనం భయపడుతున్నారు. ఇలాంటి ప్యాక్ చేసిన పానీయాలు కొనేటప్పుడు వినియోగదారులు చాలా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బాటిల్ సీల్ సరిగ్గా ఉందో లేదో గమనించాలి. తాగే ముందు ఒకసారి గ్లాసులో పోసుకుని, రంగు లేదా వాసనలో మార్పు ఉందేమో చూడాలి. ఏదైనా అనుమానం వస్తే వెంటనే స్థానిక ఆహార భద్రతా అధికారులకు (Food Safety Officers) ఫిర్యాదు చేయాలి. ఈ విషయంపై కేవిన్స్ కంపెనీ ఇంకా స్పందించాల్సి ఉంది. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.



# కోరుట్ల మున్సిపల్ కౌన్సిల్ తొలి సమావేశంలోనే రగడ




- 35 అంశాల్లో 34కు కౌన్సిల్ సభ్యుల ఆమోదం
- వార్డులలో మురికి కాలువల శుభ్రతపై చర్యలు తీసుకోవాలని సభ్యుల సూచన
- ఆ ఒక్కవార్డుకే 'నిధుల ప్రేమ' ఎందుకని ప్రశ్న.. రగడ.. అన్ని వార్డులకు సమాన నిధులకు ఆమోదం
- బడ్జెట్ సమావేశం నుంచి 'కాంగ్రెస్ సభ్యులే' వాకౌట్
- ప్రజా పాలనలో భాగంగా పనులు చేపడతామని చైర్‌పర్సన్ వెల్లడి

**నేటి సాక్షి , కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. అయితే తొలి సమావేశంలోనే రగడ మొదలైంది. మున్సిపల్ బడ్జెట్ సమావేశంపై ప్రస్తుత కౌన్సిలర్ లు,మాజీ మున్సిపల్ చైర్మన్,చైర్ పర్సన్ లు అభ్యంతరం తెలిపి వాకౌట్ చేశారు. మున్సిపల్ చట్టం ప్రకారం ఏడు రోజుల ముందు సభ్యులకు సమాచారం ఇవ్వాల్సి ఉండగా..కేవలం రెండు రోజుల ముందే ఇవ్వడం సరికాదని అన్నం లావణ్య,గడ్డమీది పవన్ లు ఆరోపించారు. ఈ క్రమంలోనే 23 వార్డుకు మాత్రమే రూ. 3.5 లక్షలు కేటాయించడంపై సభలో గందరగోళం జరిగింది. కోరుట్ల మున్సిపాలిటీ పరిధిలో 33 వార్డులుంటే..ఒక్క 23 వ వార్డుకు మాత్రమే ప్రేమ చూపడంలో ఆంతర్యమేంటని సభ్యులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దీంతో చైర్ పర్సన్ అన్ని వార్డులకు సమానంగా రూ. 3.5లక్షల చొప్పున నిధులు కేటాయిస్తున్నట్లు ఆమోదం తెలిపారు. కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో మొత్తం 35 అంశాలను అజెండాగా పొందుపరిచారు. వాటిలో 34 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో పట్టణంలోని అన్ని వార్డుల్లో మురికి కాలువలను శుభ్రం చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు కోరారు. కాలువలు శుభ్రం చేయడం ద్వారా పట్టణంలో పరిశుభ్రత మెరుగుపడుతుందని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత మాట్లాడుతూ.. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో మురికి కాలువల శుభ్రపరిచే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వసంత, మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ ఈఈ, మేనేజర్, జేఏఓతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మెట్‌పల్లిలో 13వ జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య ):** మెట్‌పల్లి పట్టణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అలాగే రాధ్య బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా జనసేన సైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు సుమారు 60 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అయ్యప్ప గుడి ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించి, రోడ్డుపై ఉన్న నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కూడా జనసేన జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎలుగందుల అజయ్ కుమార్, బండి రమాదేవి, మ్యాదరపు మారుతి, అబ్బూరి ఆనంద్ రాజ్ గౌడ్, కోటగిరి అరుణ్ గౌడ్, వన్నెల రాకేష్, కదరి శ్రీకాంత్, పద్రె సంతోష్, రాంప్రసాద్, యూసుఫ్ నగర్ ఉపసర్పంచ్ బసవేని రమేష్, మణి సాయి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడిగా ఫాలోజి సత్యం



**నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య):** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జగిత్యాల పట్టణ అధ్యక్షుడిగా ఫాలోజి సత్యంను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర నాయకత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా ఫాలోజి సత్యం మాట్లాడుతూ తనను పట్టణ అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారుల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ సంస్థ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడిగల రవీందర్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కనకం కుమారస్వామితో పాటు జిల్లా, నియోజకవర్గ స్థాయి ఉద్యమకారులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇకపై తెలంగాణ ఉద్యమకారుల ఫోరాన్ని జగిత్యాల పట్టణంలో మరింత బలోపేతం చేసి ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఫాలోజి సత్యం తెలిపారు.

# కోరుట్లలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



## హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

## ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

**నేటి సాక్షి, కోరుట్ల(రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ జనసేన పార్టీ పి.ఓ.సి వోడ్నాల రామారావు, వీర మహిళ వోడ్నాల సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అలాగే సివిల్ హాస్పిటల్‌లో రోగుల సౌకర్యార్థం చల్లని నీటి కోసం ఆరు కుండలను అందజేశారు. తరువాత 'హెల్పింగ్ సొసైటీ' ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడ్లగట్ల సురేష్, వనతడుపుల సంజీవ్, మాసం విజయ్ కుమార్, గట్ల నరేష్, ఈశ్వర్ నగర్ ఉపసర్పంచ్ రమేష్, వేములకుర్తి ప్రభాకర్, కట్ట రంజిత్, ఉషకోలా శశి, దాసోహం అనిల్, ప్రశాంత్, చిలివేరి మణిదీప్, కోటగిరి సంపత్, తుమ్మ సురేష్, పులి అనిల్, సాయి కృష్ణ, చెట్పెల్లి రాజు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# గృహ అవసరాలకు ఉపయోగపడే మొక్కలు పెంచాలి

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి • కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా నర్సరీల్లో పరిశీలన



**నేటి సాక్షి, సిరిసిల్ల(శివకుమార్):**గృహ అవసరాలకు సైతం ఉపయోగపడే మొక్కలను నర్సరీల్లో పెంచాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రగతి ప్రణాళికలో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని సాయి నగర్, జే పీ నగర్ లో సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా నర్సరీల్లో ఎన్ని రకాలు, ఎన్ని మొక్కలు పెంచుతున్నారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. నర్సరీ మొత్తం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలోని నర్సరీలో రోడ్ల వెంట, అలాగే ఇతర చోట్ల నాటే మొక్కలతో పాటుగా గృహ వినియోగానికి ఉపయోగపడే మొక్కలు సైతం పెంచాలని సూచించారు. మునగ, పండ్ల, ఇతర రకాల మొక్కలను నర్సరీల్లో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఎండాకాలం నేపథ్యంలో మొక్కలకు నీటిని పడుతూ సంరక్షించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రణాళిక ప్రకారం మొక్కలను సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. పరిశీలనలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ ఆర్డిఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**నేటి సాక్షి ,మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ఐబీ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి జనసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టి మానవతా సందేశాన్ని చాటిచెప్పారు. తర్వాత ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో అల్పాహార కార్యక్రమం నిర్వహించి సేవా కార్యక్రమాలను కొనసాగించారు. అనంతరం ఐబీ వద్ద పార్టీ జెండా ఆవిష్కరణ చేసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు సిద్దు,జిల్లా నాయకులు తన్నీరు మధుకర్ మాట్లాడుతూ.... జనసేన పార్టీ ఆవిర్భవించి నేటికి 12 సంవత్సరాలు పూర్తి చేసుకుని 13వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నదని తెలిపారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గత 12 సంవత్సరాలుగా ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి రావడంలో ఆయన కీలక పాత్ర పోషించి డిప్యూటీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం జనసేన కార్యకర్తలకు గర్వకారణమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పవన్ కళ్యాణ్ దేశ రాజకీయాల్లోనే కీలక నాయకుడిగా ఎదుగుతారని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గ నాయకులు విష్ణు, పిట్టల సుధాకర్, ఆవుల సాగర్, మేకల సుధాకర్, రంజిత్, గంధం నవీన్, 45వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి పిట్టల సంధ్యారాణి, 6వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి కుమారి హర్షిత, రమేష్, రాకేష్, రఫీ, సురేందర్ రెడ్డి, సాయికుమార్ తదితర జనసేన నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు

# మన సంస్కృతికి నాటకాలే వారధులు





**నేటిసాక్షి, మిర్యాలగూడ :** మన సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి మేలుకొలిపే విధంగా సాంఘిక పద్య నాటికలు ఎంతగానో దోహదపడతాయని రిటైర్డ్ ఉపాధ్యాయులు, కవి, రచయిత, వారణాసి ఆంజనేయులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ మరియు ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం మిర్యాలగూడ కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న నందినీ అవార్డ్స్-2026 జాతీయస్థాయి పద్య నాటక సాంఘిక నాటక పోటీలు శనివారం, ఆరవ రోజు తెలంగాణ నాటక సమాఖ్య సూర్యాపేట ఉపాధ్యక్షులు విలకత్తుల పుల్లయ్య తో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. పద్యాల ద్వారా తెలుగు భాషలోని మాధుర్యం, స్పష్టమైన ఉచ్చారణ మరియు పదజాలంపై పట్టు పెరుగుతుందని, నాటికల్లోని ఇతివృత్తాలు క్రమశిక్షణ, సామాజిక బాధ్యత మరియు మానవీయ సంబంధాల పట్ల అవగాహన కలిగిస్తాయని, నేటి కార్యక్రమంలో భాగంగా మొదట చిన్నారులచే నృత్య కార్యక్రమాలు అనంతరం "శ్రీ ఖడ్గతిక్కన" పద్య నాటకం డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీ సాయిబాబా నాట్యమండలి విజయవాడ వారిచే ప్రదర్శింపబడింది. అనంతరం నటీనటులకు, సాంకేతిక నిపుణులకు శాలువాలతో సన్మానించి, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. తదుపరి డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీ సాయిబాబా నాట్యమండలి వారిచే ఇది కొత్త కథ సాంఘిక నాటిక ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు తడకమళ్ళ రామచంద్రరావు, అధ్యక్షులు రామావతారం, ప్రధాన కార్యదర్శి పులి కృష్ణమూర్తి శర్మ, కోశాధికారి వెంకటలక్ష్మీనారాయణ శర్మ, సాయిలు, సత్యనారాయణ చారి, లక్ష్మయ్య, ఎల్లయ్య, సత్యనారాయణ, శ్రీనివాసరావు, రాఘవయ్య, శైలజ, సరస్వతి, నాగమణి, ఉపేందర్, బాబురావు, వీరప్రతాప్, టంగుటూరి రాజారాం తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయుల నాటి శివాలయాన్ని కాపాడుకోవాలి

పురావస్తు పరిశోధకులు శివనాగిరెడ్డి



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామ శివారులోనున్న నందిబోడు పైన కాకతీయుల కాలం (క్రీ.శ.13వ శతాబ్దం) నాటి శిధిల శివాలయం, భిన్నమైన శివలింగం, నంది, చెన్నకేశవ శిల్పాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో, డా. ఈమని శివనాగిరెడ్డి అన్నారు. గ్రామ సర్పంచ్ ఇంజం నర్సిరెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు, వారి ఆధ్వర్యంలో ఆయన శనివారం నందిబోడ్ పైనున్న శిల్పాలను గ్రామస్తుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శివాలయంలో చెట్లు, పుట్టలు పెరిగి, గోడలు పడిపోయాయని, ఆలయ వెనకవైపు నిర్మించిన తాత్కాలిక రేకు షెడ్డు కింద కాకతీయుల శైలి ఉట్టిపడుతున్న శివలింగం పానపట్టము, ముట్టె, చెవులు భిన్నమైన నంది, తల, కాళ్లు లేని అందంగా అలంకరించిన శ్రీదేవి, భూదేవి సహిత చెన్నకేశవ విగ్రహాలు క్రీ.శ. 700 సంవత్సరాల నాటి బొత్తలపాలెం గ్రామ చరిత్రకు ఆనవాళ్ళని, వాటిని కాపాడుకొని, భవిష్యత్తరాలు అందించాలని శివనాగిరెడ్డి గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింగ్ అనిల్, గ్రామ పెద్దలు పగిడిపాటి శ్రీనివాస్ రెడ్డి, వీరారెడ్డి, రవీందర్ రెడ్డి, కందుల బిక్షారెడ్డి, పలసాని రామ్ రెడ్డి, పోటుపల్లి బాబు, ఉదయ్, సిరసాల సైదులు, నామా రవీందర్, ఆకారపు గోపాల్, మునగాల వెంకటరెడ్డి, ఇంకా శిల్పి బి. వెంకటరెడ్డి, పింగళి వెంకట నాగప్రసాద్ పాల్గొన్నారని శివనాగిరెడ్డి చెప్పారు.



# అంగన్వాడీలకు ఆరోగ్య పరీక్షలు

**నేటి సాక్షి, చౌడేపల్లి :** చౌడేపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కార్యకర్తలు ఆయాలకు ఆరోగ్య పరిక్షలు నిర్వహించారు, శనివారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మోనా అంగన్వాడి కార్యకర్తలు ఆయాలకు వైద్య పరీక్షలు నిర్వహించారు ,అంగన్వాడీలు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే చిన్నారుల పట్ల శ్రద్ధ వహిస్తారని ఈ సందర్భంగా వారు అన్నారు, ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సులోచన రాధ మండలంలోని అంగన్వాడీలు పాల్గొన్నారు,

# జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**నేటి సాక్షి, చౌడేపల్లి :** మండల కేంద్రమైన చౌడేపల్లిలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు, ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు కోల సోమశేఖర్ జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు ,అనంతరం కేక్ ను కట్ చేసి పంచిపెట్టారు, పుంగనూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత్వాల దామోదలో ముందంజలో ఉందని ఇదే ఉత్సాహంతో 15 వేల వరకు చేయాలని పార్టీ కేడర్ను కోరారు స్వాతంత్రం సిద్ధించిన 79 సంవత్సరాల తర్వాత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలలోని ప్రజలకు నీరు నీడ దారి అందించిన ఘనత దక్కిందన్నారు ,మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు, ప్రతి జన సైనిక వీరనారీలు పార్టీ ఆవిర్భావ దినోత్సవం లో పాల్గొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో పుంగనూరు సింగిల్ విండో అధ్యక్షుడు పగడాల రమణ .జనసేన పార్టీ మండల నాయకులు గందోడి చరణ్ పురుషోత్తం .శ్రీకాంత్ .హేమంత్. నరేష్. శేషాద్రి తదితరులు పాల్గొన్నారు,

# ఇఫ్తార్ విందులో గువ్వల రమేష్ రెడ్డి




**నేటి సాక్షి, చౌడేపల్లి:** మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ దాచేపల్లిలో జరిగిన ముస్లింల ఇఫ్తార్ విందులో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి పాల్గొన్నారు, గ్రామ ముస్లింలు రంజాన్ పండుగను పురస్కరించుకుని ఇఫ్తార్ విందుకు ఆయనను ఆహ్వానించారు, ముస్లిం పద్ధతిలో వస్త్రధారణ చేసి విందులో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు, అనంతరం ఆయన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి ఆర్థిక సహాయాన్ని అందించారు, ఈ కార్యక్రమంలో గని గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు

# ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



**నేటి సాక్షి నారాయణపేట, (ఇమామ్ సాబ్ ):** నారాయణపేట జిల్లాలోని ప్రతి మండల కేంద్రాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి పరీక్షలను నిర్వహించింది శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంతో పాటు మరికల్ ధన్వాడ ఊట్కూర్ మక్తల్ దామరగిద్ద మగనూరు విద మండలాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇటు పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాట్లను నిర్వహించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు పరిశీలించడం జరిగింది. మొదటిరోజు 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.



# పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రైవేటు పాఠశాలలు

- మరికల్ మండల కేంద్రంలో అధిక ఫీజులను అసలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు !?...
- పట్టించుకోని ప్రభుత్వ అధికారులు
- ఎల్కేజీ యూకేజీ.... ముక్కు పిండి వసూలు చేస్తున్న అక్రమ ఫీజులు ప్రైవేటు విద్యాసంస్థలు




**నేటి సాక్షి నారాయణపేట, (ఇమామ్ సాబ్ ):** వచ్చే విద్యా సంవత్సరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు నూతన విద్యా విధానంను మార్పులు చేస్తానని ఇటీవల ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని పలు రాజకీయ పార్టీల నాయకులు, విద్యావేత్తలు ఇది సాధ్యం కాదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన విద్యాబోధన లేనందువల్ల ప్రజలు ప్రైవేటు విద్యాసంస్థలను ఆశ్రయిస్తున్నారని విద్యావంతులు చర్చించుకుంటున్నారు. 50 సంవత్సరాల కిందట ఉన్న విద్యా ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం లేదన్నారు. అప్పట్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు బదిలీ అయిన ప్రవేశంలోనే కుటుంబంతో జీవనం గడిపేవారని అంటున్నారు అందుచేత ప్రభుత్వం బాధ్యతగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే వారని విద్యావంతులు అంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలో వదిలి ఉద్యోగానికి హాజరవుతున్నారని పలువురు అంటున్నారు. అప్పటిలో ఏ గ్రామంలో పనిచేసే ఉపాధ్యాయులకు బాధ్యతగా మెలిగేవారని అంటున్నారు. ప్రతి నెల లక్షల రూపాయలు ఒక్కొక్క ప్రభుత్వ ఉపాధ్యాయుడికి వేతనాలు చెల్లిస్తున్న అవన్నీ నిరుపయోగమే అవుతున్నదని గ్రామీణులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో సరైన విద్యాబోధన లేనందువలనే విద్యార్థుల తల్లిదండ్రులు కూలినాలి చేసి తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని వారి వారి పిల్లలను ప్రైవేటు విద్యాసంస్థలలో కష్టపడి శ్రమ వచ్చి చదివిస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని మార్పులు చేసిన అవి కార్యరూపం దాల్చినంతవరకు ప్రభుత్వం విద్యా విధానంలో ఎన్ని మార్పులు తీసుకొని వచ్చినా అవన్నీయు బూడిదలో పోసిన పన్నీరే అవుతుందన్నారు. గత 30 సంవత్సరాల నుండి అండదండలతో ప్రైవేటు విద్యాసంస్థలు మనుగడ సాధిస్తున్నాయని పలువురు ప్రభుత్వ విధానాలను ఎండగడుతున్నారు. కనీసం విద్య విధానంలో మార్పులు రాకున్నా ప్రైవేటు విద్యాసంస్థలలో సరైన విద్యా బోధనను అమల్లో ఉందని గ్రామీణులు తమ పిల్లలను ప్రైవేటు విద్యాసంస్థలకు విద్యాబోధనకు పంపుతున్నారని అంటున్నారు. ప్రభుత్వ అండదండలతో వీళ్లకు వేల రూపాయలు లెక్క లేకుండా లక్షల వరకు ఒక్కొక్క విద్యార్థి నుంచి ప్రవేటు విద్యాసంస్థలు వసూలు చేస్తున్న మండల విద్యా అధికారి,జిల్లా అధికారి ఏమాత్రం పట్టించుకోవడం లేదని పలు సంఘాల నాయకులు వాపోతున్నారు. ఉదాహరణకు నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో ప్రైవేటు విద్యాసంస్థలు చాలా వెలిశాయన్నారు అక్రమంగా విచ్చలవిడిగా విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేయడం వల్ల వారు సొంత భవనాలను లక్షల రూపాయలతో ఖర్చు చేసి నిర్మించుకుంటున్నారని చర్చించుకుంటున్నారు. ఇక్కడ విద్యా సంఘాలు ప్రైవేటు పాఠశాలలపై అక్రమ వసూలు ఎందుకు చేస్తున్న విషయంపై అధికారులు అరికట్టడం లేదని పలు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. మరికల్ మండలంలో ప్రవేట్ పాఠశాలలు అక్రమంగా అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాధికారులు పట్టించుకోకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒకవైపు తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజులు నియంత్రణ చేస్తామని ప్రకటించిన ప్రకటన వారికే ప్రస్తుతం అయ్యాయని విద్యార్థుల తల్లిదండ్రులు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన విధానాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ లేకపోతే కొంతవరకు ఏమాత్రం మార్పు సాధ్యం కాదని ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజులు తగ్గే స్తే నే ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించినట్లు విద్యా విధానంలో మార్పు సాధ్యం అవుతుందని పలువురు అంటున్నారు. ఈ మేరకు మరికల్ మండల కేంద్రంలో ప్రైవేటు విద్యాసంస్థలపై ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలలను తనిఖీలు నిర్వహించి, ఫీజులను అరికట్టి చర్యలు తీసుకోవాలని విద్య సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మరికల్ మండల కేంద్రంలో ప్రవేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేయడంపై నారాయణపేట జిల్లాలోని చర్చినివిషంగా మారిందిని మరికల్ మండలంలో చర్చించుకుంటున్నారు. నారాయణపేట జిల్లా కలెక్టర్, జిల్లా డీఈవో, మరికల్ మండలం ఎంఈఓ లు మరికల్ ప్రైవేట్ పాఠశాలలను పరిశీలించి అక్రమ ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యా సంఘాలు, మరికల్ మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ముస్లిం కమిటీ ఎన్నికల కమిషనర్‌గా ఇమ్రాన్

**నేటి సాక్షి, జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు ):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని జమా మసీద్‌లో ముస్లిం మత పెద్దలు,ముస్లిం కమిటీ సమావేశం నిర్వహించి సెంట్రల్ ముస్లిం కమిటీ ఎన్నికల కమిషనర్‌గా సీనియర్ జర్నలిస్ట్ మొహమ్మద్ ఇమ్రాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఎన్నికల కమిషనర్‌గా ఉన్న మహమ్మద్ అలీ 4 సంవత్సరాలుగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన లెక్కలు చూపించకపో వడంతో పాటు నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవ హరించారని ఆరోపిస్తూ మత పెద్దలు ఆయనను తొలగిం చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిషనర్ మొహమ్మద్ ఇమ్రాన్‌ను మత పెద్దలు శాలువాతో సత్కరిం చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ భారీ, జనరల్ సెక్రటరీ హాజా నయుముద్దీన్ మంజూర్, అబ్దుల్ సజీద్, అఖీల్ ఉద్దిన్ జావీద్, పట్వారి సాజిద్, పట్వారి ముజాహిద్, మున్సిపల్ వైస్ చైర్మన్ మున్నా, కౌన్సిలర్లు కమల్, అయూబ్ ఖాన్, అఫ్రోజ్, అహ్లే హదీస్ జగిత్యాల కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రషీద్, జమాతే ఇస్లామియా నాయకులు ఈమాదుద్దీన్, తౌహీద్ అలీ, పాత్రికేయులు మోసిక్, హైదర్ అలీ, అదిల్, ఫజల్ తదితరులు పాల్గొన్నారు.



# ఇచ్చిన హామీలను అసెంబ్లీలో ప్రవేశపెట్టాలి

**నేటి సాక్షి మంచిర్యాల్( శ్రీధర్ దమ్ము):** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే అసెంబ్లీలో ఆటోలకు బడ్జెట్ కేటాయించాలి బెల్లంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి గారికి ఆటో జేఏసీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కట్ట రామ్ కుమార్ డిమాండ్ నోటీసులి కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 1000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇవ్వడం తో పాటు 12 వేల రూపాయలు ఇంకా అనేకమైన హామీలు ఇవ్వడం జరిగిందని రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న గాని ఇంకా ఏ ఒక్క హామీ కూడా అమలు చేయాలేదని తక్షణమే ఈ నెల 16 నుంచి జరుగు అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఆటోలకు బడ్జెట్ కేటాయించాలని బెల్లంపల్లి ప్రాంతంలో నీ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే గారిని కలిసి డిమాండ్ చేస్తూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో భీమిని మండల్ ఆటో జేఏసీ ప్రెసిడెంట్ సత్యనారాయణ గౌడ్ గారు కన్నెపల్లి మండల్ ఆటో జేఏసీ అధ్యక్షులు అంజన్న గారు సీనియర్ ఆటో డ్రైవర్ బూర్ల యాదగిరి గారు రాంపూర్ స్వామి గారు వెంకటాపూర్ సీనియర్ ఆటో డ్రైవర్ ముఖ్య సలహాదారుడు తదితరులు ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు



# గజ్వేల్ ప్రజలకు దూరమైన ఎమ్మెల్యే కేసీఆర్?

## తీన్మార్ మల్లన్న ఆరోపణ

**నేటి సాక్షి గజ్వేల్ :** గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న ఆరోపించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి నిరంతరం నియోజకవర్గాల్లో పర్యటిస్తుంటే, గజ్వేల్ ఎమ్మెల్యే మాత్రం నియోజకవర్గంలో తన సొంత ఫామ్ హౌస్‌లో ఉండి కూడా ప్రజలను కలవడం లేదని ఆయన విమర్శించారు. గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ మజీద్‌లో సయ్యద్ బాబా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు, మైనార్టీల సంక్షేమం కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ కట్టుబడి పనిచేస్తోందన్నారు. తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్న రాజ్యాధికార పార్టీకి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. మైనార్టీలను రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటున్నాయని, ముస్లింల అభివృద్ధి కోసం సరైన సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని ప్రభుత్వాలను ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాజ్యాధికార పార్టీ నాయకులు జ్యోతి పండాల్, బిక్షపతి, నర్సింగ్ లతో పాటు సంగాపూర్ ప్రాంతానికి చెందిన ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# గ్రామాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

**నేటి సాక్షి గజ్వేల్ :** గజ్వేల్ మండల పరిధిలోని గ్రామాల సర్పంచులతో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన రవికుమార్ గ్రామాల అభివృద్ధి మరియు శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజా ప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని ప్రవేశ, నిష్క్రమణ మార్గాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దీనివల్ల గ్రామాల్లోకి వచ్చే అపరిచిత వ్యక్తుల కదలికలను గమనించడం సాధ్యమవుతుందని, నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించి పట్టుకోవడం సులభమవుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, అతి వేగంతో డ్రైవింగ్ చేయడం వంటి చర్యలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కారణంగా జరిగే ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సర్పంచులకు సూచించారు. అలాగే గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను వెంటనే నిలిపివేయాలని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేకాట లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు గ్రామాలు వేదిక కాకుండా చూడాలని, అలాంటి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

# 17న చలో హైదరాబాద్



**నేటి సాక్షి, అనంతగిరి :** ఈనెల 17వ తేదీన హైదరాబాదులో జరగబోయే తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని కార్మికులు అధిక సంఖ్యలో జయప్రదం చేయాలని అనంతగిరి మండల పంచాయతీ కార్మికుల యూనియన్ అధ్యక్షులు మట్టపల్లి వీరబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మట్టపల్లి వీరబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల వేతనాలను పంచాయతీల ద్వారానే చెల్లించాలని నిర్ణయిస్తూ మార్చి 2వ తేదీన జారీ చేసిన మెమోను తక్షణమే రద్దు చేయాలని అన్నారు. రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రతినెల గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని ప్రకటించిన విధంగా నేరుగా కార్మికుల వ్యక్తిగత ఖాతాలలో జమ చేయాలని వారు తెలిపారు. వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఒక్క పూట పని కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పంచాయతీ కార్మికులందరూ హైదరాబాదులో జరగబోయే సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

# పరీక్ష కేంద్రానికి స్వంత ఖర్చులతో వాహన సదుపాయం



**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని గున్ముక్ల గ్రామానికి చెందిన బీజేవైఎం రాష్ట్ర నాయకుడు ప్రవీణ్ రెడ్డి తన స్వంత ఖర్చుతో గున్ముక్ల, మంత్రోనిపల్లి, ఎంనోనిపల్లి గ్రామాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు ధన్వాడ పరీక్ష కేంద్రానికి చేర్చడానికి రెండు వాహనాలను సమాకూర్చారు. ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ గున్ముక్ల గ్రామం నుండి ధన్వాడ పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి సరైన రవాణా సౌకర్యం లేనందువల్ల గత నాలుగు సంవత్సరాల మాదిరిగా ఈ సంవత్సరం కూడా రవాణా సౌకర్యం కల్పించానని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సూచన మేరకు బాలురు మరియు బాలికలకు వేరువేరుగా వాహనాలను ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. గత నాలుగు సంవత్సరాల నుండి ఈ సదుపాయాన్ని కలిపిస్తున్న ప్రవీణ్ రెడ్డి ని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు అభినందించారు.

# పదో తరగతి పరీక్షలు ప్రారంభం



**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్ మండల వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మండలంలో విద్యాశాఖ అధికారులు మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 1,559 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి అదనంగా ఐదు నిమిషాల గ్రేస్ టైమ్‌ను విద్యార్థులకు కల్పించినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు, ప్రాథమిక వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాధికారి కృష్ణ తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు లోనుకాకుండా ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఆయన సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు ధైర్యం చెప్పుతూ కనిపించారు.

# చేబర్తిలో విషాదఛాయలు

**విద్యుత్ షాక్‌తో మీటర్ రీడర్ మృతి. శోకసంద్రంలో కుటుంబ సభ్యులు..**



**నేటిసాక్షి, జగదేవపూర్:** విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో మీటర్ రీడర్‌గా పనిచేస్తున్న యువకుడు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో తిగుల్, చేబర్తి, అంగడికిష్టాపూర్ గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులను ఈ విషాదం తీవ్రంగా కలచివేసింది. చేబర్తి గ్రామానికి చెందిన నీరుడి బాబు గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ విధానంలో మీటర్ రీడర్‌గా పనిచేస్తున్నారు. తిగుల్ గణేష్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో మీటర్ల రీడింగ్ తీసుకోవడం, చిన్నపాటి లైన్మెన్ పనులు కూడా ఆయన బాధ్యతల్లో భాగంగా నిర్వహించేవారు. విధి నిర్వహణలో ఎప్పుడూ నిబద్ధతతో పనిచేసే వ్యక్తిగా గ్రామస్తులలో మంచి పేరును సంపాదించారు. శనివారం చేబర్తి శ్రీవారు ప్రాంతంలో ఉన్న ఒక వ్యవసాయ క్షేత్రంలో కరెంట్ సరఫరా సమస్య తలెత్తడంతో, దానిని సరిచేయడానికి ఆయన అక్కడికి వెళ్లినట్లు తెలిసింది. ఈ క్రమంలో వ్యవసాయ క్షేత్రంలో ఉన్న విద్యుత్ స్తంభంపై పీసు వైరు అమర్చే ప్రయత్నంలో ఉండగా అనుకోకుండా విద్యుత్ షాక్ తగిలింది. తీవ్రమైన షాక్‌కు గురై ఆయన అక్కడికక్కడే కుప్పకూలాడు ఇది గమనించిన ఆయన వెంట ఉన్న విద్యుత్ సిబ్బంది ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు బంధువులు స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. మృతునికి భార్య, నాలుగు సంవత్సరాల చిన్న కూతురు తల్లిదండ్రులను వదిలి వెళ్ళడం కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి ఇలా అనుకోకుండా మృతి చెందడంతో వారు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామస్తులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని అన్న నీరుడి సురేష్ విద్యుత్ శాఖలో గజ్వేల్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. తమ్ముడి మృతి వార్త తెలుసుకున్న వెంటనే అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యాడు. తమ్ముడితో తనకు ఎంతో అనుబంధం ఉందని, కుటుంబానికి ఆయన పెద్ద ఆశ్రయమని చెప్పుకుంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. మృతుని భార్య తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ, విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే సిబ్బందికి సరైన భద్రతా పరికరాలు, శిక్షణ కల్పించాలని కోరుతున్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం, విద్యుత్ శాఖ నుంచి ఆర్థిక సహాయం అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఈ యువకుడి మరణం తిగుల్, చేబర్తి, అంగడికిష్టాపూర్ ప్రాంతాల ప్రజలను తీవ్రంగా కలచివేసింది.

# గ్యాస్ సిలిండర్లకు కొరత లేదు

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా లో గ్యాస్ సిలిండర్ల కొరత గృహావసరాలకు, విద్యాలయాలు, ఆసుపత్రులకు ఎల్. పీ.జీ సరఫరాలో ఎలాంటి లోటు లేదని, ప్రజలు ఎవ్వరు ఆందోళన చెందవద్దని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో గృహ అవసరాలకు, విద్యాలయాలు, ఆసుపత్రులకు అవసరమైన ఎల్.పీ.జీ. సిలిండర్ల సమస్య లేదని, అవసరమైన మేర సరఫరా చేసేందుకు పగడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగిందని, జిల్లామరియు మండలం వారీగా బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని, గృహ అవసరాలకు ఉపయోగించే సిలిండర్ లను ఎవ్వరైనా అక్రమంగా నిల్వ చేసిన, బ్లాక్ మార్కెటింగ్ చేసిన అట్టి వ్యక్తులపై న చట్ట రీత్యా చర్యలు తీసుకోబడునని, బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ 7 (నిత్యావసర వస్తువుల పరిరక్షణ)చట్టం ప్రకారం కఠినచర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. జిల్లా లో గ్యాస్ కు సంబందించిన ఏవైనా సమస్యలు ఎదురైతే జిల్లా కలెక్టరెట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్ 9885930418ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఏవైనా సమస్యలుంటే పైనెంబర్‌కు సంప్రదిచాలని తెలిపారు.




# వేంపెంటలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



నేటి సాక్షి పాములపాడు: పాములపాడు మండలంలోని,వేంపెంట గ్రామం నందలి బీసీ కాలనీలో గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ, గ్రామ టిడిపి నాయకుడు & సింగిల్ విండో చైర్మన్ జె.వి.లక్ష్మీకాంతరెడ్డి, టిడిపి బీసీ సెల్ మండల అధ్యక్షుడు కంభం.మోహన్ గౌడ్, యూనిట్ ఇన్చార్జి ఎస్.ఆదిరెడ్డి, తదితర నాయకులతో కలిసి భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ ఎం.లెనిన్ బాబు, ఎన్.జోసఫ్, బీసీ సెల్ కార్యదర్శి డి.మల్లికార్జున నాయుడు. ఏ.చంద్రశేఖర్ గౌడ్, గంటా.మధు సుధాకర్, చాకలి వెంకటసుబ్బయ్య, ఏ.చంద్ర గౌడ్, ఆర్.మహానంది, డి.స్వామన్న నాయక్, డి.హుస్సేన్, డి.పక్కిరయ్య, టి.కృష్ణ, వడ్డే సుబ్బయ్య, రిటైర్డ్ గవర్నమెంట్ టీచర్ వై.దానమయ్య, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# పారమిత.. ఇదేం రోత!

**రోడ్డుపైనే మురికిగుంత..**

**నేరుగా పొలాల్లోకి మురుగునీరు..**

**కంపులో మునుగుతున్న సమీప కాలనీవాసులు..**






**నేటిసాక్షి, తిమ్మాపూర్:** తిమ్మాపూర్ మండలంలోని అలుగునూర్ గ్రామంలో గల పారమిత పాఠశాల ఆ స్కూల్లో చదివే పిల్లలకు మంచి నేర్పుతుందో..? లేదో..? తెలియదుగానీ, అలుగునూర్ వాసులకు మాత్రం మురిగునీరుతో ముప్పు తిప్పలు పెడుతోంది. పిల్లలకు విద్యాబుద్ధులు చెప్తున్న పాఠశాల యాజమాన్యం, అవేవీ మాకు పట్టవని సమాజానికి చెప్తోంది. పాఠశాల నుంచి మురుగును నేరుగా పొలాల్లోకి వదలడమే కాకుండా స్కూల్కు ఉపయోగించే ట్రాన్స్ఫార్మర్ను సైతం నడి రోడ్డుపైనే వేసింది.

**రోడ్డుపైకే మురికినీరు..**

దాదాపు పదిహేనేళ్ల క్రితం అలుగునూర్లో ఓ ప్రైవేట్ స్థలాన్ని కొనుగోలు చేసిన పారమిత పాఠశాల యాజమాన్యం అందులో భవనం నిర్మించి స్కూల్ను ప్రారంభించింది. స్కూల్ ప్రహరీని ఓ పెద్ద మురికినీటి గుంతను తవ్వింది. ఈ గుంతను ఆనుకొని కరీంనగర్ – హైదరాబాద్ రాజీవ్ రహదారికి కనెక్టివిటీ రోడ్డు ఉంది. ఈ రోడ్డుగుండా పెద్దగా రాకపోకలు లేకపోవడంతో యథేచ్ఛగా మురికినీటిని వదిలిపెడుతోంది. గుంతలోంచి మురికినీరు రోడ్డుమీదుగా బయటకు వచ్చి నేరుగా పొలాలతో పాటు పరిసరాల్లోకి వచ్చి చేరుతోంది. దీంతో చుట్టుపక్కల పరిసరాలన్ని కంపుకొడుతుండగా, అటువైపుగా వెళ్లినప్పుడు ప్రజలు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

**రోడ్డుపైనే ట్రాన్స్ఫార్మర్..**

అంతేకాకుండా స్కూల్కు వినియోగించే ట్రాన్స్ఫార్మర్ను సైతం నడిరోడ్డుపైనే వేసుకొని, వాడుకుంటున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తున్న స్థానికులను వారికున్న పలుకుబడితో బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం సహజంగా మారింది. ఇప్పటికే చాలాసార్లు అధికారులకు ఫిర్యాదుచేశామనీ, అయినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు కల్పించుకొని తగిన చర్యలు తీసుకోవాలంటూ స్థానిక రైతులతో పాటు చుట్టుపక్కల ప్రజలు కోరుతున్నారు.




**మునిసిపల్ ఫిర్యాదు చేశా..**



అలుగునూర్లోని పారమిత పాఠశాల తీరుపై కరీంనగర్ మునిసిపల్లో ఇప్పటికే ఫిర్యాదుచేశా. పొలాల్లోకి వచ్చే మురికినీటి విషయమై ఇదివరకే పాఠశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా. అయినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. అధికారులు ఈ విషయంపై దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలి.దాసం నాగేందర్, మాజీ సర్పంచ్.

# కోరుట్లలో శ్రీ వీర హనుమాన్ విజయాత్రకు కరపత్రాల ఆవిష్కరణ


**భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్యక్రమం**



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో మార్చి 28న నిర్వహించనున్న శ్రీ వీర హనుమాన్ విజయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఘనంగా ఆవిష్కరించారు. కోరుట్ల పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో బజరంగ్ దళ్ మరియు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)తో పాటు వివిధ హిందూ సంఘాల నాయకులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, కౌన్సిలర్లు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. మార్చి 28న జరగనున్న శ్రీ వీర హనుమాన్ విజయాత్రను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

# చేనేత కార్మికుల అభివృద్ధికి కృషి

**ఎంపీ డీకే అరుణ**



**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలోని చేనేత క్లస్టర్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు ఎంపీ డీకే అరుణ , శనివారం కోటకొండ గ్రామంలోని ప్రగతి చేనేత సహకారం సంఘం లిమిటెడ్ కోటకొండ ఆధ్వర్యంలో, క్లస్టర్ కింద మంజూరైన చేనేత కార్మికుల మగ్గాల పరికరాలను అందజేయడానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీడీకే అరుణమాట్లాడుతూ నారాయణపేట గద్వాల్ కోటకొండ చేనే త కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అవన్నీ చేనేత కార్మికులు లబ్ధి పొందాలని చేనేత కార్మికులకు సూచించారు. చేనేత కార్మికుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా నారాయణపేట కోటకొండ పట్టుచీరలకు పేరుగాంచిందని ఎంతో నైపుణ్యం కలిగిన చేనేత కార్మికులు కలిగి ఉన్న ప్రాంతం వారికి ఎప్పుడూ సాయం చేయడానికి ముందు ఉంటానని చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు, కేంద్ర ప్రభుత్వ పథకాలు చేనేత కార్మికులు లబ్ధి చేకూర్చే బాధ్యత అధికారులు చూడాలని సూచించారు, కార్యక్రమంలో ప్రగతి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు నరసింహులు, చేనేత సహకార జిల్లా అధ్యక్షులు పగడాకుల, శ్రీనివాసులు, బిజెపి ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి కెంచ్ శ్రీనివాస్,కార్యదర్శి జి భాస్కర్, సర్పంచ్ వెంకట్రాములు గౌడ్, ఉప సర్పంచ్ చెన్నప్ప యాదవ్, చేనేత ఏడి బాబురావు, డి ఓ రాజేష్, ఏడిఓ విజయ్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్, రాష్ట్ర నాయకులు రతంగ్ పాండురెడ్డి, రఘుపాల్ యాదవ్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతే పోలీస్‌ల లక్ష్యం

**చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ, కోటపల్లి ఎస్సై**




**నేటి సాక్షి, మంచిర్యాల:** కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో ఘనంగా స్వచ్ఛత కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా కోటపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ, కోటపల్లి ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అందరూ సమిష్టిగా నడుంబిగించి స్టేషన్ పరిసరాలను అందంగ్గా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా అధికారులు మరియు సిబ్బంది స్వయంగా శ్రమదానం చేస్తూ, స్టేషన్ లోపల మరియు వెలుపల ఉన్న చెత్తా ని తొలగించి పరిశుభ్రత పట్ల తమ నిబద్ధతను చాటారు.ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో అస్తవ్యస్తంగా పెరిగిన పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కేవలం పరిసరాలనే కాకుండా, స్టేషన్‌లోని రికార్డులను సైతం క్రమపద్ధతిలో , సర్దుతూ దుమ్ము లేకుండా శుభ్రపరిచారు. విధి నిర్వహణలో నిరంతరం బిజీగా ఉండే సిబ్బంది, సామాజిక బాధ్యతగా భావించి ఈ స్వచ్ఛత యజ్ఞంలో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం.ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు మరియు ప్రజలకు ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సమస్యలతో స్టేషన్‌కు వచ్చే వారు ఇక్కడి పరిసరాలను చూసి మానసిక ప్రశాంతత పొందేలా ఉండాలని, అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ స్వచ్ఛత దిశగా అడుగులు వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పరిశుభ్రమైన వాతావరణం పని ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, ప్రజల్లో పోలీసుల పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.